మా కలం.. మీ గళం..

RNI : APTEL/ 2017/74310

# మన గళం

దిన పత్రిక

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ పబ్లిషర్ : నగరూరు రాఘవేంద్ర సంపుటి : 08 సంచిక : 160 బుధవారం 03 - 12 - 2025 పేజీలు: 8 వెల: 4

## అసత్య ప్రచారం కాదు, వాస్తవాలు చూడండి : మంత్రి లోకేష్




2లో..

- సరఫరా సమస్యలు, వ్యయం తగ్గింపు కీలకాంశాలు
- పీఎం కుసుమ్ - సోలార్ రూఫ్ టాప్ అమలు పురోగతి
- ట్రాన్స్‌కో, జెన్‌కో, డిస్కమ్‌లకు స్పష్టమైన దిశానిర్దేశం



# విద్యుత్ రంగంపై సీఎం చంద్రబాబు సమీక్ష

అమరావతి, 02 డిసెంబర్ మనగళం,: విద్యుత్ రంగంలో కొనసాగుతున్న ముఖ్య అంశాలపై రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేడు సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. విద్యుత్ సరఫరాలో జరుగుతున్న అంతరాయాలు, పంపిణీ వ్యవస్థ సామర్థ్యం, వినియోగదారులకు నిరంతరాయ సేవలందించే చర్యలపై విస్తృత చర్చ జరిగినట్లు సమాచారం. సమీక్షలో తక్షణ పరిష్కారాలు, దీర్ఘకాల ప్రణాళికలు రెండింటినీ సమన్వయం చేసే దిశగా అధికారులకు సూచనలు ఇచ్చినట్టు తెలిసింది. ఇక పీఎం కుసుమ్ పథకం, సోలార్ రూఫ్ టాప్ ప్రాజెక్టుల అమలు పురోగతి పై కూడా సభలో ఆవలోకనం జరిగింది. ముఖ్యంగా వ్యవసాయ రంగానికి నూతన శక్తి వినియోగం ద్వారా మన్నికైన విద్యుత్ వ్యవస్థను ఏర్పాటు చేసే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణ, దిగువ తరగతి రైతులకు వ్యయభారం తగ్గించడం వంటి అంశాలను లక్ష్యంగా పెట్టుకొని సూర్యశక్తి వినియోగాన్ని గ్రామీణ స్థాయిలో విస్తరించాల్సిన అవసరం ఉందని సమావేశంలో అభిప్రాయపడ్డారు. విద్యుత్ ఉత్పత్తి, పంపిణీలో వ్యయం తగ్గింపు అంశం సమావేశంలో ప్రధాన చర్చాంశంగా నిలిచింది. డిస్కమ్‌లు ఎదుర్కొంటున్న ఆర్థిక ఒత్తిడి, విద్యుత్ కొనుగోలు ఖర్చుల్లో సంస్కరణలు, సామర్థ్యవంతమైన నిర్వహణకు తీసుకోవాల్సిన చర్యలపై ముఖ్యమంత్రి విపులంగా సూచనలు చేసినట్టు అధికారులు వెల్లడించారు. ఈ నేపథ్యంలో, నిరుపయోగ శక్తి వినియోగాన్ని తగ్గించి, ఆర్థిక వ్యవస్థను పటిష్ఠం చేసే దిశగా ప్రణాళికలు రూపొందించాలని దిశానిర్దేశం చేశారు. విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్, ట్రాన్స్‌కో, జెన్‌కో అధికారులు, డిస్కమ్ సీఎండీలు ఈ సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు. విద్యుత్ రంగంలో సాంకేతిక ఆధునికీకరణ, ప్రజల అవసరాలకు అనుగుణంగా సేవల మెరుగుదల, పారదర్శక విధానాల అమలు పట్ల చర్చ జరిగిందని వర్గాలు తెలిపాయి. మొత్తం మీద రాష్ట్ర శక్తి అవసరాలను తీర్చే విధంగా సమగ్ర చర్యలపై ప్రభుత్వం దృష్టి సారించినట్టు పేర్కొన్నారు.



## ఇక హైవేలపై ప్రయాణం మరింత సురక్షితం



- ఎన్‌హెచ్‌ఏఐ - రిలయన్స్ జియో కీలక ఒప్పందం
- మొబైల్‌కు నేరుగా ప్రమాద హెచ్చరికలు
- కొత్త సిస్టమ్ దేశవ్యాప్తంగా అమలు పోవనుంది

న్యూఢిల్లీ : డిసెంబర్ 2 మన గళం, : దేశంలోని జాతీయ రహదారులపై ప్రయాణం ఇక మరింత సురక్షితంగా మారనుంది. హైవేల్లో ప్రమాదాలు తగ్గించేందుకు 2 లో..

## ఇమ్రాన్ ఖాన్ మరణించారంటూ కలకలం



- రావల్పిండి - ఇస్లామాబాద్‌లో భద్రత కట్టుదిట్టం
- జైలు అధికారులు మరణ వార్తలను ఖండింపు
- కుటుంబ సభ్యులను కలిసేందుకు అనుమతి లేక అనుమానాలు
- పీటీఐ కార్యకర్తల భారీ నిరసనలకు దిగ్విజయ ఏర్పాటు

ఇస్లామాబాద్, డిసెంబర్ 2 , మన గళం, : పాకిస్థాన్ మాజీ ప్రధానమంత్రి, తెహ్రీక్ ఇన్సాఫ్ వ్యవస్థాపకుడు ఇమ్రాన్ ఖాన్‌ను రావల్పిండిలోని అదియాలా జైలులో చిత్రహింసలకు గురిచేసి హత్య చేశారంటూ సోషల్ మీడియా, అంతర్జాతీయ వర్గాల్లో విస్తృతంగా ప్రచారం జరుగుతోంది. బలూచిస్థాన్ విదేశీ వ్యవహారాల శాఖ కూడా ఆర్మీ చీఫ్ ఆసిం మునీర్, నిఘా సంస్థ ఐఎస్‌ఐ సంయుక్త కుట్రగా ఇమ్రాన్‌ను హతమార్చారని ఆరోపించడంతో ఈ విషయం మరింత వేడెక్కింది. అయితే అదియాలా జైలు అధికారులు వెంటనే 2 లో..

## కేంద్ర మంత్రి గడ్కరిని కలిసిన మంత్రి టీజి, ఎంపీ బస్తిపాటి



2 లో..

## ద్వైపాక్షిక చర్చల్లో నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి



మనగళం, ప్రత్యేక ప్రతినిధి : భారత్ - జార్జియా దేశాల మధ్య న్యూ ఢిల్లీలో మంగళవారం లోక్ సభ స్పీకర్ ఓం ప్రకాష్ బిర్లా నాయకత్వంలో జార్జియా ప్రతినిధి బృందంతో ద్వైపాక్షిక చర్చలు జరిగాయి. జార్జియా ప్రతినిధుల బృందానికి భారత్ తరుపున నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి బృందం స్వాగతం పలికారు. జార్జియా షల్వా పాపువాష్విలి పార్లమెంటు 2 లో..

## అమెరికాలో సిక్కు ట్రక్కు డ్రైవర్లకు సంక్షోభం



- రవాణా శాఖ కఠిన చర్యలు
- పంజాబీ డ్రైవర్లు టార్గెట్‌లో

న్యూఢిల్లీ, డిసెంబర్ 2 , మన గళం, : అమెరికాలో ట్రక్కు రంగంలో పనిచేస్తున్న సిక్కు డ్రైవర్లపై పరిస్థితి మరింత కఠినమైంది. దేశవ్యాప్తంగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాలు పెరుగుతుండటంతో, అక్కడి రవాణా శాఖ కమర్షియల్ డ్రైవర్లపై పూర్తి స్థాయి తనిఖీలు ప్రారంభించింది. ముఖ్యంగా పంజాబీ యువత భారీ సంఖ్యలో ట్రక్కు డ్రైవర్లుగా 2 లో..

## స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించాలి

- ఏపీఈడబ్ల్యూఐడీసీ డైరెక్టర్ నగరూరు రాఘవేంద్ర




2 లో..

## ప్రధాని కార్యాలయం ఇక నుంచి సేవాతీర్థ్

- నూతన భవనానికి కేంద్రం నామకరణం
- రాజ్‌భవన్ పేరు కూడా మార్పు దిశగా
- దేశవ్యాప్తంగా ప్రభుత్వ భవనాల పేర్ల మార్పుపై దృష్టి

న్యూఢిల్లీ, డిసెంబర్ 2, మన గళం, : దేశపాలనలో కీలక పాత్ర పోషించే ప్రధాన మంత్రి కార్యాలయానికి కేంద్ర ప్రభుత్వం కొత్త పేరు కట్టింది. ఇకపై ప్రధాన మంత్రి కార్యాలయం "సేవాతీర్థ్" పేరుతో కొనసాగనుంది. నూతనంగా నిర్మించిన ఢిల్లీలోని కార్యాలయ భవనానికి ఈ నామకరణం 2 లో..



# ఇక హైవేలపై ప్రయాణం మరింత సురక్షితం

నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (%చీనూ×%) అత్యాధునిక మొబైల్ ఆధారిత భద్రతా హెచ్చరిక వ్యవస్థను ప్రవేశపెడుతోంది. ఇందుకోసం రిలయన్స్ జియోతో మహత్తర ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం కింద ప్రమాద అవకాశాలు ఉన్న ప్రాంతాలు, కఠిన వాతావరణ పరిస్థితులు, రోడ్లపై పశువుల సంచారం, సడన్ డైవర్షన్స్ వంటి కీలక సమాచారాన్ని నేరుగా ప్రయాణికుల మొబైల్‌కు పంపనున్నారు.

ఈ సరికొత్త సిస్టమ్ కోసం అదనపు హెచ్చరిక బోర్డులు అవసరం లేకుండా, పూర్తిగా జియో 4జీ, 5జీ నెట్‌వర్క్‌పై ఆధారపడుతుందని అధికారులు తెలిపారు. ప్రయాణికులకు ఎస్‌ఎంఎస్‌లు, వాట్సాప్ అలర్ట్స్, హై ప్రైయారిటీ కాల్స్ రూపంలో ముందస్తు హెచ్చరికలు చేరడం వల్ల డ్రైవర్లు ముందుగానే జాగ్రత్తలు తీసుకునే వీలుంటుంది.

ప్రాజెక్ట్ తొలి దశగా దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన ఎన్‌హెచ్‌ఏఐ ప్రాంతీయ కార్యాలయాల్లో పైలట్ మోడ్‌లో అమలవనుంది. ట్రయల్స్ తరువాత ఈ సిస్టమ్‌ను జాతీయ రహదారి నెట్‌వర్క్ మొత్తం మీద విస్తరించేందుకు ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. ఈ వ్యవస్థను హైవేయాత్ర యాప్, ఎన్‌హెచ్‌ఏఐ డిజిటల్ ప్లాట్‌ఫారమ్స్, నేషనల్ హైవే ఎమర్జెన్సీ నంబర్ 1033తో అనుసంధానం చేయనున్నారు.

డేటా రక్షణ ప్రమాణాలను ఖచ్చితంగా పాటిస్తూ సురక్షితమైన హెచ్చరికలు అందేలా చర్యలు తీసుకుంటామని హైవేస్ అథారిటీ స్పష్టం చేసింది. భవిష్యత్తులో ఇతర టెలికాం సంస్థలను కూడా ఈ వ్యవస్థలో చేర్చి దేశవ్యాప్తంగా అన్ని హైవేలు రియల్ టైమ్ సేఫ్టీ అలర్ట్ ఫెసిలిటీతో పనిచేసేలా చర్యలు తీసుకోనున్నారు. ఈ ఒప్పందం రహదారులపై జర్నీ సేఫ్టీని పెంపొందించే దిశగా ప్రధాన ముందడుగు అంటూ అధికారులు భావిస్తున్నారు.

# ఇమ్రాన్ ఖాన్ మరణించారంటూ కలకలం



స్పందిస్తూ, ఈ కథనాలన్నీ అసత్యమని, ఇమ్రాన్ ఖాన్ పూర్తిగా క్షేమంలో ఉన్నారని ప్రకటించారు. అయినప్పటికీ ఇమ్రాన్ ఖాన్‌ను ఆయన కుటుంబసభ్యులు, న్యాయవాదులు, పార్టీ నాయకులు కూడా చూడలేకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. జైలు అధికారులు ఎవరికీ దర్శన మంజూరు చేయకపోవడంతో పీటీఐ కార్యకర్తలు తీవ్రమైన ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇమ్రాన్ పరిస్థితిపై స్పష్టత ఇవ్వాలని, వెంటనే ఆయనను ప్రజలకు చూపించాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా నిరసనలకు సిద్ధమయ్యారు. రావల్పిండిలోని అదియాలా జైలు వెలుపల, ఇస్లామాబాద్ హైకోర్టు సమీపంలో భారీ స్థాయిలో ఆందోళన చేపట్టేందుకు పీటీఐ వర్గాలు సిద్ధమవుతుండడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. రెండు నగరాల్లో సెక్షన్ 144 అమలు చేశారు. బుధవారం వరకు ర్యాలీలు, బహిరంగ సభలను నిషేధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇస్లామాబాద్, రావల్పిండిలో అదనపు భద్రతా దళాలను మోహరించారు. ఇమ్రాన్ ఖాన్ 2022లో నమ్మకద్రోహ తీర్మానం అనంతరం పదవి కోల్పోయిన తర్వాత కొత్త ప్రభుత్వం ఆయనపై అవినీతి, అక్రమ ఆస్తులు, ఉగ్రవాదానికి మద్దతు వంటి పలు కేసులు నమోదు చేసింది. 2023 ఆగస్టు నుంచి ఇమ్రాన్ జైలులోనే ఉన్నారు. ఇక గత కొన్ని నెలలుగా ఆయనను ఎవ్వరూ చూడలేదు. కుటుంబ సభ్యులు ఇటీవల జైలుకు వెళ్లగా వారిని అనుమతించడమే కాకుండా, పోలీసుల చేతుల మీదుగా లాగి, తోసివేసి అవమానించారని ఆయన సోదరీమణులు ఆరోపించారు. అఫ్ఘాన్ టైమ్స్ పత్రిక చూసిన కొన్ని వర్గాల ఆధారంగా 'ఇమ్రాన్ ఖాన్ మరణించారు' అంటూ కథనాలు ప్రచురించగా, వెంటనే పాక్ విదేశాంగ శాఖ ఒక ప్రకటన విడుదల చేసింది. కానీ కొద్ది గంటల్లోనే పాక్ సమాచార శాఖ ఆ ప్రకటనను తప్పుడు సమాచారమని ప్రకటించింది. ఇదంతా దేశ రాజకీయాలపై ఉత్కంఠను పెంచింది. పీటీఐ నేతలు మాత్రం ఇమ్రాన్ ఖాన్‌ను ప్రజల ముందుకు తక్షణమే తీసుకురావాలని, లేదంటే దేశవ్యాప్తంగా మహా నిరసనలు తప్పవని హెచ్చరిస్తున్నారు.

## అమెరికాలో సిక్కు ట్రక్కు డ్రైవర్లకు సంక్షోభం

అమెరికాకు వెళ్లడం వల్ల, వారు ఇప్పుడు నేరుగా అధికారుల టార్గెట్‌లోకి వచ్చారు.

అమెరికాలో మొత్తం సుమారు లక్షన్నర మంది సిక్కు ట్రక్కు డ్రైవర్లు పనిచేస్తున్నట్లు అంచనా. ఇందులో పశ్చిమ తీరం ప్రాంతాల్లోనే దాదాపు 40 శాతం పంజాబీలు ఉన్నారు. దేశవ్యాప్తంగా ట్రక్కు డ్రైవర్లలో సిక్కుల వాటా 20 శాతం పైగానే ఉంటుంది. ఇటీవల సంభవించిన ప్రమాదాల్లో డ్రైవర్లు సిక్కులే కావడంతో, రవాణాశాఖ, ఇమ్మిగ్రేషన్ అధికారులు కలిసి డ్రైవర్ల బ్యాక్‌గ్రౌండ్, లైసెన్సులు, శిక్షణ ప్రమాణాలపై కఠినంగా దృష్టి పెట్టారు. ఈ క్రమంలో దేశవ్యాప్తంగా ఉన్న మూడు వేల డ్రైవింగ్ స్కూళ్ల సర్టిఫికేషన్‌ను రద్దు చేసే అవకాశముంది. సరైన శిక్షణ లేకుండా ట్రక్కు డ్రైవర్లను బయటకు పంపుతున్నట్లు అధికారులు గుర్తించిన స్కూళ్లకు కేవలం 30 రోజుల వ్యవధిలో నిర్ణయం తీసుకోనున్నారు. ఇప్పటికే 4,500 స్కూళ్లకు నోటీసులు జారీ చేసినట్లు సమాచారం.

కాలిఫోర్నియాలో వలస కార్మికుల ఆధీనంలో నడుస్తున్న డ్రైవింగ్ స్కూళ్లు ప్రత్యేకంగా నిఘాలో ఉన్నాయి. కమర్షియల్ లైసెన్సులు ఇవ్వడానికి అవసరమైన ప్రమాణాలు చేరుకున్నాయా లేదా అన్నదానిపై విస్తృతంగా తనిఖీలు జరుగుతున్నాయి.

ఒకవేళ శిక్షణ ప్రమాణాలు తీరకపోతే, వేలాది సిక్కు డ్రైవర్ల భవిష్యత్తు సంక్షోభంలో పడే అవకాశం ఉందని రవాణా శాఖ అధికారులు హెచ్చరించారు.

# ప్రధాని కార్యాలయం ఇక నుంచి సేవాతీర్థ్

అధికారికంగా అమల్లోకి వచ్చింది.

నవంబర్ 25న కేంద్ర హోంశాఖ ఒక ప్రత్యేక ప్రకటన విడుదల చేసిన విషయం తెలిసిందే. ఆ ప్రకటన ప్రకారం ప్రధాన మంత్రి కార్యాలయం పేరును సేవాతీర్థ్‌గా, రాష్ట్రపతి భవనాలుగా ఉన్న రాజ్‌భవన్‌ల పేరును లోక్‌భవన్‌గా మార్చాలని కేంద్రం నిర్ణయించింది. ఈ ప్రక్రియలో భాగంగానే ఇవాళ పీఎంఓకు 'సేవాతీర్థ్' అని నూతన పేరును అమలు చేసినట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి.

ఈ నిర్ణయంతో దేశవ్యాప్తంగా భవనాల పాత నామకరణం నుంచి ప్రజలకు మరింత చేరువయ్యే పేర్లను ఇవ్వాలనే కేంద్ర విధానంలో మరో అడుగు ముందుపడింది. అందులో భాగంగా ఇప్పటికే కొన్ని రాష్ట్రాలు తమ రాష్ట్ర రాజ్‌భవన్‌లను 'లోక్‌భవన్'గా మార్చాయి. ఈ జాబితాలో త్వరలో తెలంగాణ కూడా చేరనుంది. హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌కు 'లోక్‌భవన్'గా పేరు పెట్టే ప్రక్రియ పూర్తయినట్లు అధికార వ్యవహారాల దృష్ట్యా సమాచారం అందుతోంది.

కేంద్రం తీసుకున్న ఈ చర్య దేశ రాజకీయ వాతావరణంలో విస్తృత చర్చకు దారితీస్తోంది. పేర్ల మార్పు ద్వారా ప్రజలకు మరింత సమీపతను చాటుకునే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ప్రజాసేవ మార్గంలో ప్రభుత్వ భవనాల పాత్రను ప్రతిబింబించేలా సేవాతీర్థ్, లోక్‌భవన్ వంటి పేర్లు నిర్ణయించడమే ప్రధాన ఉద్దేశ్యమని కేంద్ర వర్గాలు పేర్కొంటున్నాయి.

# కేంద్ర మంత్రి గడ్కరిని కలిసిన మంత్రి టీజీ, ఎంపీ బస్తిపాటి

మనగళం, ప్రత్యేక ప్రతినిధి : కర్నూలు టూ బళ్ళారి హైవే ఏర్పాటు పై కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరితో రాష్ట్ర మంత్రి టీజి భరత్ ,కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు సుదీర్ఘంగా చర్చించారు. ఢిల్లీలోని మంత్రి కార్యాలయంలో ఆయనతో సమావేశమైన వారు కర్నూలు టూ బళ్ళారి కి హైవే ఏర్పాటు చేయడం ద్వారా ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలను అనుసందానించడంలో కీలక పాత్ర పోషించడంతో పాటు, వాణిజ్యం , పర్యాటకం మరియు ప్రాంతీయ అభివృద్ధి ని సులభతరం చేస్తుందని వివరించారు. ఈ మేరకు ప్రతిపాదనలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి టీజి భరత్, ఎంపీ బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ హైవే ఏర్పాటు పై కేంద్ర మంత్రి గడ్కరి సానుకూలంగా స్పందించారని తెలిపారు.

# ద్వైపాక్షిక చర్చల్లో నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి

చైర్మన్, ఆయన ప్రతినిధి బృందం భారతదేశానికి వచ్చారు. రెండు దేశాలకు సంబంధించిన ద్వైపాక్షిక చర్చలలో కూడా నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి పాల్గొన్నారు. చర్చల అనంతరం భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్, జార్జియా ప్రతినిధులతో కలిసి లోక్ సభ స్పీకర్ ఓం ప్రకాష్ బిర్లా, భారత ప్రతినిధులు, ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరిలు కూడా భోజనానికి హాజరయ్యారు. ఈ ద్వైపాక్షిక చర్చలు భారత్, జార్జియా దేశాల సంబంధం భలోపేతం, ఉమ్మడి ప్రజాస్వామ్యం, విలువలు, సమీప భవిష్యత్ లో భారత్ – జార్జియా దేశాల పార్లమెంటరీ స్నేహ సమూహాన్ని ఏర్పాటుకు, విస్తరిస్తున్న పార్లమెంటరీ భలోపేతకు ఈ ద్వైపాక్షిక చర్చలు దోహదపడుతాయన్న నమ్మకాన్ని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి వ్యక్తం చేశారు.



# స్వదేశీ ఉత్పతుల్తను ప్రోత్సహించాలి

మనగళం, కర్నూలు సిటీ : ప్రతిఒక్కరూ స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించాలని ఏపీ ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ నగరూరు రాఘవేంద్ర పిలుపునిచ్చారు. ప్రతి ఇంటా స్వదేశీ... ఇంటింటా స్వదేశీ అన్న భారత ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు స్వదేశీ వస్తువులను కొనుగోలు చేయాలని కోరారు. ప్రతి ఇంటా స్వదేశీ ఇంటింటా స్వదేశీ కార్యక్రమంలో భాగంగా మంగళవారం బీజేపీ శ్రేణులు ఖాదీ వస్త్రాలు కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా నగరూరు రాఘవేంద్ర మాట్లాడుతూ స్వదేశీ వస్తువులను నిర్లక్ష్యం చేస్తున్నందునే చేతి వృత్తులు దూరం అవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రత్యేకించి ఎంతో పేరొందిన నేతన్నల పరిస్తితి అధ్వానంగా మారిందన్నారు. ధర్మవరం తర్వాత జిల్లాలో అత్యధికంగా ఎమ్మిగనూరు, కోడుమూరు, ఆదోని, నందవరం, నాగలదిన్నె, కోసిగి, గుడేకల్లు, ఎక్కువమంది నేతన్నలు ఉన్నారన్నారు. వీరంతా మాస్టరు వీవర్స్ కింద నేస్తున్నారని తెలిపారు. తెలంగాణలోని గద్వాలతోపాటు మన జిల్లాలోని ఎమ్మిగనూరు, కోడుమూరు పరిధిలో 400 మంది వ్యాపారులు ఉన్నట్లు అంచనా అన్నారు. వీరంతా ముడి సరకును బెంగళూరు, చీరాల, ధర్మవరం తదితర ప్రాంతాల నుంచి తీసుకొస్తుంటారు. జిల్లాలో 17 వేలకు పైగా పట్టు మగ్గాలు ఉన్నట్లు అంచనా ఉంది. ధరలు పెరగడంతో మగ్గాల సంఖ్య తగ్గుతోందని విచారం వ్యక్తం చేశారు. కార్మికులకు ఒక చీర నేసేందుకు వారం నుంచి 16 రోజులు పడుతుందని, ఎంతో నైపుణ్యం కనిస్తుందన్నారు. అయితే ఎంతో కష్టపడి నేస్తున్న వస్త్రాలకు మనం ప్రాధాన్యత ఇవ్వనందున నేతన్నల పరిస్తితి దయనీయంగా మారిందని విచారం వ్యక్తం చేశారు. మగ్గం నేస్తున్న నేత కార్మికులు కష్టాలు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పట్టు మగ్గాలపై ఆధారపడిన కార్మికులు, మాస్టరు వీవర్లకు ఇప్పుడు కొత్త సమస్య ఎదురైందన్నారు. పట్టు చీరల తయారీకి ఉపయోగించే వార్పు, సప్పూరి ధరలు మూడు నెలల వ్యవధిలో కిలోకు రూ.1,200 కు పైగా పెరిగిందని, పట్టు ఉత్పత్తి తగ్గడంతో ముడి పట్టుకు డిమాండ్ ఏర్పడిందన్నారు. జిల్లాలో చేనేత మగ్గాలకు అవసరమైన ముడిసరకు రాక తగ్గిపోయిందన్నారు. ప్రతిఒక్కరూ చేనేత వస్త్రాలకు ప్రాధాన్యత ఇవ్వాలని, అప్పుడే చేతి వృత్తులు కొనసాగుతాయని చెప్పారు. ఇక నుంచి స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించాలని, చేనేతలకు అండగా నిలువాలని ఈ సందర్భంగా నగరూరు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు వేల్పుల గోపాల్, వీరన్న, అడ్వకేట్ లోకేష్, సూర్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# అసత్య ప్రచారం కాదు, వాస్తవాలు చూడండి : మంత్రి లోకేష్



అమరావతి, డిసెంబర్ 2 మనగళం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీపై వైకాపా చేస్తున్న ప్రకటనలు పూర్తిగా అబద్ధాలపై ఆధారపడి ఉన్నాయని రాష్ట్ర మంత్రి నారా లోకేష్ తీవ్రంగా మండిపడ్డారు. వైకాపా తన సోషల్ మాధ్యమాల ద్వారా, ప్రతి నెల వేల సంఖ్యలో పింఛన్ల కోతలు విధిస్తున్నామని, ప్రభుత్వం లబ్ధిదారులను నిర్లక్ష్యం చేస్తోందని విస్తృతంగా ప్రచారం చేస్తోంది. దీనిపై స్పందించిన లోకేష్, "జగన్ రెడ్డికి ఎప్పుడు కల వచ్చినదో కానీ, కోతల విషయంలో చేస్తున్న దుష్ప్రచారం వాస్తవానికి దూరమైనది" అని వ్యాఖ్యానించారు.

లోకేష్ వివరించిన ప్రకారం, ప్రస్తుత నెలలో కొత్తగా వేల మందికి పింఛన్లు మంజూరు చేయబడినట్లు ప్రభుత్వం స్పష్టం చేసినా, వైకాపా మాత్రం ఈ సమాచారాన్ని పూర్తిగా విస్మరిస్తోందని చెప్పారు. "అర్హులైన వృద్ధులు, కార్మికులు, మహిళలు, వివిధ వర్గాలు వారికి సహాయం అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది. కానీ గతంలో వైకాపా హయాంలో ఒక నెల పింఛన్ తీసుకోకపోతే 'తూచ్ మేమే తింటాం' అనే ధిక్కారం చూపించారు" అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

తమ పాలనలో సామాజిక భద్రతపై భారీ స్థాయిలో ఖర్చు చేసిన విషయాన్ని గుర్తుచేసిన లోకేష్, "కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత, సామాజిక పింఛన్లు కేవలం ప్రకటనగా కాదు, ప్రజలకు నేరుగా ఆర్థిక భరోసాగా అందిస్తున్నాం. బాధ్యత, కట్టుబాటు, పారదర్శకత ఇవి మా వైఖరి" అన్నారు.

సోషల్ మాధ్యమాల్లో వైకాపా చేస్తున్న దుష్ప్రచారంపై స్పందిస్తూ, "అసత్యాలతో ప్రజలను తప్పుదోవ పట్టించడం మీ ప్రభుత్వం చేసే పని. కానీ ప్రజలు ఇప్పుడు మోసపోవడం లేదు. వాస్తవాలు చూసే జాగృతి పెరిగింది. ప్రజాస్తానం ఇచ్చిన తేడా మీ తప్పులకు సమాధానం" అని వ్యాఖ్యానించారు.

లోకేష్ పార్టీ శ్రేణులకు పిలుపునిస్తూ, "సోషల్ మీడియాలో జరిగే అబద్ధాలను క్షేత్రస్థాయిలో ఖండించాలి. నిజమైన సమాచారం ప్రజలకు చేరాలి. ఈ ప్రభుత్వ నిర్ణయాలు ప్రచారం కోసం కాదు, ప్రజల జీవితాలను నిలబెట్టడానికి" అని తెలిపారు. ప్రస్తుత రాజకీయ వాతావరణంలో, పింఛన్ల వంటి సంక్షేమ కార్యక్రమాలు ప్రచార యుద్ధాల సాధన కాకూడదని, అవి ప్రజలకు జీవన భరోసాను అందించే హక్కులుగా కొనసాగాలని లోకేష్ స్పష్టం చేశారు. ఆయన వ్యాఖ్యానించిన తీరు, వైకాపా సోషల్ మాధ్యమాల్లో సాగిస్తున్న ప్రచారాన్ని ప్రతిస్పందనాత్మక దశలోకి నెట్టింది.

బుధవారం
03 - 12 - 2025

మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

## మంత్రి నారా లోకేష్ ను కలిసిన ఎంపీ నాగరాజు



మనగళం, కర్నూలు సిటీ : ఢిల్లీలోని పార్లమెంటులోని టీడీపీ పార్లమెంటరీ కార్యాలయానికి వచ్చిన రాష్ట్ర మంత్రి నారా లోకేష్ ను కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు మర్యాద పూర్వకంగా కలిశారు. పార్లమెంట్ సమావేశాలలో పాల్గొంటున్న ఎంపీ, మొంథా తుపాను ప్రభావం వలన రాష్ట్రంలో జరిగిన నష్టం అంచనా సమగ్ర నివేదికను కేంద్ర మంత్రులు అమిత్ షా, శివరాజ్ సింగ్ చౌహాన్ కు అందించేందుకు వచ్చిన లోకేష్ ను ఎంపీ కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ నాగరాజు జిల్లా లో మొంథా తుపాను మూలంగా కలిగిన నష్టాన్ని లోకేష్ కు వివరించారు.

## బ్లడ్ బ్యాంకుకు స్టేట్ ఫస్ట్ అవార్డు అభినందనీయం

**– ఆసుపత్రి సూపరింటెండెంట్, డా. కె వెంకటేశ్వర్లు**



మనగళం, కర్నూలు సిటీ : కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల బ్లడ్ బ్యాంక్ కు రాష్ట్రంలోనే అత్యధికంగా బ్లడ్ యూనిట్ల ను కలెక్ట్ చేసినందుకు రాష్ట్రస్థాయిలో మొట్టమొదటి స్థానం లభించడం అభినందనీయమని ఆసుపత్రి సూపరింటెండెంట్, డా. కె వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. డిసెంబరు 1వ తేదీన విజయవాడలో తుమ్మలపల్లి కళాక్షేత్రంలో బ్లడ్ బ్యాంక్ తరపున స్టేట్ ఫస్ట్ అవార్డు తీసుకున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా బ్లడ్ బ్యాంక్ సిబ్బందితోపాటు డాక్టర్లకు ఆయన అభినందనలు తెలిపారు. బ్లడ్ బ్యాంక్ యందు సంవత్సరకాలంలో 1,1531 బ్లడ్ యూనిట్స్ కలెక్ట్ చేసినందుకు రాష్ట్రస్థాయిలో మొదటి స్థానం సాధించడం జరిగిందన్నారు.

## మొండి బకాయిదారులపై ఉదాసీనత తగదు

**– నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్**

మనగళం, కర్నూలు కార్పొరేషన్ : నగరాభివృద్ధికి పన్నులే ప్రధాన ఆధారమని, వాటిని రాబట్టడంలో ఉదాసీనత వైఖరి తగదని నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ స్పష్టం చేశారు. మంగళవారం నగరపాలక కార్యాలయంలో రెవెన్యూ విభాగ సిబ్బందితో పన్ను వసూళ్ల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. నగరపాలకకు

రూ.93 కోట్ల ఆస్తి పన్నులు, 14.78 కోట్ల తాగునీటి కొళాయి చార్జీల బకాయిలు రావాల్సి ఉన్నాయని, అందులో మొండి బకాయిలే అధికంగా ఉండటం సరైన పద్ధతి కాదన్నారు. వెంటనే మొండి బకాయిదారులకు నోటీసులు జారీ చేయాలని, ఇప్పటికే జారీ చేసిఉంటే దుకాణాలను సీజ్ చేయాలని ఆదేశించారు. నగరం ప్రగతి పథంలో నడవాలంటే పన్నులే కీలకమని, ప్రజలే స్వచ్ఛందంగా పన్నులను చెల్లించి నగరాభివృద్ధికి తోడ్పాటు అందించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్ఓలు జునైద్, స్వర్ణలత, వాజిద్, ఆర్ఐలు, పాల్గొన్నారు.

## బయలు వీరభద్రస్వామికి ప్రదోషకాల అభిషేకం



మనగళం శ్రీశైలం : లోకకల్యాణం కోసం దేవస్థానం ఈ రోజు (02.12.2025) సాయంకాలం శ్రీశైలక్షేత్ర పాలకుడైన శ్రీబయలు వీరభద్రస్వామివారికి విశేషపూజలను జరిపించనున్నది. ప్రతీ మంగళవారం మరియు అమావాస్యరోజులలో బయలు వీర భద్ర స్వామి వారికి ఈ విశేష అభిషేకం, అర్చనలను నిర్వహించబడుతున్నాయి. బయలు వీర భద్ర స్వామి వారు శివభక్తగణాలకు అధిపతి. అదేవిధంగా శ్రీశైలక్షేత్రపాలకుడుగా క్షేత్రానికి ఆరుబయట ఉండి, ఎటువంటి ఆచ్ఛాదన, ఆలయం లేకుండగా బయలుగా దర్శనమిస్తాడు కనుక ఆయనకు బయలువీరభద్రస్వామి అని పేరు వచ్చింది. ప్రసన్నవదనంతో కిరీట మకుటాన్ని కలిగి దశభుజుడైన స్వామివారు పది చేతులలో వివిధ ఆయుధాలతో దర్శనమిస్తాడు. స్వామివారికి క్రిందివైపున కుడివైపు దక్షుడు, ఎడమవైపు భద్రకాళి దర్శనమిస్తారు. ఈ స్వామిని దర్శించినంత మాత్రానే ఎంతటి క్లిష్ట సమస్యలైనా తొలగిపోతాయని, వ్యాధులు నశించి ఆయురారోగ్యాలు చేకూరుతాయని ప్రసిద్ధి. ముఖ్యంగా ఆగమసంప్రదాయంలో క్షేత్రపాలక పూజకు చాలా విశేషస్థానం ఉంది. క్షేత్ర పాలకుడికి పూజలు చేయడం వలన ఆ క్షేత్రంలో ఉన్నటువంటి భక్తులు ఎటువంటి భయం,బాధలు లేకుండా సుఖసంతోషాలతో ఉంటారు. మంగళవారం, ఆదివారం మరియు అమావాస్య రోజులలో చేసే వీరభద్రపూజ అనేక ఫలితాలు ఇస్తుందని ఆగమశాస్త్రాలు చెబుతున్నాయి. ఈ స్వామిపూజతో సకలగ్రహ అరిష్టదోషాలు, దుష్టగ్రహపీడలు తొలగిపోతాయి. అదేవిధంగా సంతానం, ఐశ్వర్యం మొదలైన అనేక శుభఫలితాలు చేకూరుతాయి. ఈ పూజాదికాలలో పంచామృతాలతోనూ, బిల్వోదకం, కుంకుమోదకం, హరిద్రోదకం, భస్మోదకం, గంధోదకం, పుష్పోదకం, శుద్ధజలాలతో స్వామివారికి అభిషేకం నిర్వహించడం జరుగుతుంది.

# బాధితులకు న్యాయం చేస్తాం

**– నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్**
**– ఆర్డీపి-2, ఎన్‌హెచ్-340 రహదారుల విస్తరణపై సమీక్ష**
**– పత్రాలు సమర్పించేవారికి త్వరితగతిన పరిహారం**



మనగళం, కర్నూలు కార్పొరేషన్ : నగరంలో కొనసాగుతున్న రహదారి విస్తరణ పనుల్లో భూమి, భవనాలు కోల్పోయే బాధితులందరికీ పూర్తి స్థాయి న్యాయం చేస్తామని కమిషనర్ తెలిపారు. నగరపాలక కార్యాలయంలో కిడ్స్ వరల్డ్ నుండి బుధవారపేట బ్రిడ్జి వరకు (ఆర్డీపి-2), చెక్‌పోస్ట్ నుండి ఎస్ఎస్ గార్డెన్స్ వరకు రహదారి విస్తరణ పురోగతిపై పట్టణ ప్రణాళిక అధికారులతో కమిషనర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రహదారుల విస్తరణ పనులను వేగవంతం చేయడానికి అవసరమైన ప్రక్రియలను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. బాధితులకు ట్రాఫిక్ నియంత్రణకు రహదారుల విస్తరణ ఆవశ్యకతను వివరించి, యాజమాన్య పత్రాలను తీసుకోవాలని ఆదేశించారు. కిడ్స్ వరల్డ్ నుండి బుధవారపేట బ్రిడ్జి వరకు రహదారి విస్తరణలో ప్రభావితమవుతున్న 82 ఆస్తుల యజమానులతో మాట్లాడి, వారి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఆదేశించారు. ఎన్‌హెచ్-340సి రహదారి విస్తరణకు సంబంధించిన 201 ప్రభావిత ఆస్తుల యజమానులతో ఇరువైపులా సమగ్రంగా మాట్లాడి, వారి సందేహాలను నివృత్తి చేయాలని, ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. నగరాభివృద్ధికి ప్రజల సహకారం కీలకం కాబట్టి, స్వచ్ఛంగా సహకారం అందిస్తే అభివృద్ధి మరింత వేగవంతం అవుతుందని కమిషనర్ పేర్కొన్నారు. సమీక్షలో ఇంచార్జీ సిటీ ప్లానర్ బి.వెంకటరమణ, పట్టణ ప్రణాళిక అధికారి అంజాద్ బాషా, బిల్డింగ్ ఇన్ స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఐసీటీసీ సెంటర్ కు ఉత్తమ సేవల అవార్డు



మనగళం, కర్నూలు సిటీ : ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా కర్నూల్ ప్రభుత్వ సర్వజన వైద్యశాల నందుగల మైక్రోబయాలజీ విభాగం పరిధిలో పనిచేస్తున్న ఐసీటీసీ సెంటర్ రాష్ట్ర స్థాయి ఉత్తమ సేవల అవార్డు అందుకుంది. హెచ్ఐవీ స్క్రీనింగ్ సేవలు, కౌన్సెలింగ్ నాణ్యత, డేటా మేనేజ్‌మెంట్, పేషెంట్ కేర్‌లో చూపుతున్న నిరంతర ప్రొఫెషనల్ పనితీరుకు గుర్తింపుగా ఈ పురస్కారం లభించిందని ఆసుపత్రి అడిషనల్ డీఓంఈ అండ్ సూపరిండెండెంట్ డా.కె.వెంకటేశ్వర్లు అభినందనలు తెలిపారు. మైక్రోబయాలజీ విభాగాధిపతి, ప్రొఫెసర్ డా. రెణుకాదేవి, ప్రొఫెసర్ డా. నాగజ్యోతి, ఐసీటీసీ ఇన్‌ఛార్జ్ డా.శరణ్య కౌన్సిలర్స్, లాబ్ టెక్నీషియన్లు ను అభినందిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

## 14న బాలాజీ నగర్ లో హైందవ శంఖారావం

మనగళం, కర్నూలు సిటీ : రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ వంద సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఈ నెల 14వ తేదీ ఆదివారం కర్నూలు నగరంలోని బాలాజీ నగర్ హైందవ శంఖారావం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు హైందవ శంఖారావం నిర్వహణ సమితి సభ్యులు తెలిపారు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ 1925వ సంవత్సరం విజయదశమి రోజున నాగపూర్ లో డాక్టర్ కేశవరావు బలిరాం హేడ్గేవార్ ప్రారంభించారని, 2025 విజయదశమికి వంద సంవత్సరాలు పూర్తి అయ్యాయని తెలిపారు. దీంతో ఈ సంవత్సరం భారతదేశం మెత్తం రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ఏడు కార్యక్రమాలు చేయాలని నిర్ణయించిందన్నారు. మూడవ కార్యక్రమంగా హిందూ సమ్మేళనాలు చేపడుతున్నామన్నారు. హిందూ సమాజం దేశం మెత్తం హిందూ సమ్మేళనాలు నిర్వహిస్తుందని, ఇందులో భాగంగా బాలాజీ నగర్ లో హైందవ శంఖారావం అనే కార్యక్రమం చేపడుతున్నామన్నారు. హైందవ శంఖారావం కార్యక్రమానికి హిందువులు తరలివచ్చి విజయవంతం చేయాలని సమితి సభ్యులు పిలుపునిచ్చారు.

## సీఐటీయూ మహాసభల పోస్టర్లను విడుదల




మనగలం, కర్నూలు సిటీ : విశాఖపట్నంలో ఈ నెల 31 నుంచి జనవరి 4వ తేదీ వరకు నిర్వహించే సీఐటీయూ అఖిలభారత మహాసభల పోస్టర్లను మంగళవారం నాయకులు విడుదల చేశారు. కార్మిక కర్షక భవన్ సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పిఎస్ రాధాకృష్ణ యండి అంజి బాబు మాట్లాడారు. అఖిలభారత మహాసభల సందర్భంగా జనవరి 4న ఆర్కే బీచ్ లో జరిగే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఆంధ్ర రాష్ట్రం విడిపోయాక జరుగుతున్న మొట్టమొదటి సీఐటీయూ ఆల్ ఇండియా మహాసభలు విశాఖపట్నంలో జరగడం కార్మిక వర్గానికి గర్వకారణం అన్నారు. ఉద్యోగ కార్మికులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న దాడులను ఈ మహాసభల ద్వారా ఎదుర్కొంటామన్నారు. ఉద్యోగ కార్మిక ఐక్యతను చాటి మహాసభల జయప్రదానికి యావత్ కార్మిక వర్గం కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు నిర్మలమ్మ, రామాంజనేయులు, గోపాల్, ప్రభాకర్, విజయ్, రామాంజనేయులు, నరసింహులు, తిమ్మప్ప, ఉమా, బాల దుర్గమ్మ, సుధాకరప్ప తదితరులు పాల్గొన్నారు.

## మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకించండి





మనగళం, కర్నూలు సిటీ : కూటమి సర్కార్ మెడికల్ కాలేజీలను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించేందుకు కుట్రలు పన్నుతోందని, ప్రతిఒక్కరూ మూకుమ్మడిగా వ్యతిరేంకించాలని మాజీ ఎమ్మెల్యే, వైసీపీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి, వైసీపీ రాష్ట్ర మహిళా విభాగ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్వీ విజయ మనోహరి పిలుపునిచ్చారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కర్నూలు నగర పరిధిలోని 16వ వార్డు బుధవార పేటలో మంగళవారం వారు కోటి సంతకాల కార్యక్రమం నిర్వహించారు. ఈ మేరకు ఎస్వీ విజయ మనోహరి మొదటి సంతకం చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎస్వీ దంపతులు ఇంటింటికీ వెళ్లి మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణతో జరిగే నష్టాన్ని వివరించారు. కూటమి సర్కార్ విద్యారంగాన్ని భ్రష్టు పట్టిస్తుందని, పేదలకు వైద్య విద్యను దూరం చేస్తుందని విశదీకరించారు. మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా వైద్య కళాశాలలను తీసుకొచ్చారని గుర్తు చేశారు. అయితే కూటమి పెద్దలు ఓర్వలేక మెడికల్ కళాశాలను ప్రైవట్ పరం చేస్తున్నారని విమర్శించారు. ఎస్ఆర్సిపి అనుబంధ విభాగాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# మద్యం తాగి వాహనం నడిపిన ట్రావెల్స్ బస్సు డ్రైవర్లకు జైలు శిక్ష

మనగళం, కర్నూలు క్రైం : జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు రోడ్డు ప్రమాదాల నివారణకు కర్నూల్ పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. 120 మంది ప్రయాణికులతో బళ్లారి నుండి హైదరాబాద్ వెళ్తున్న

ఐవిఆర్ ట్రావెల్స్, గీతా ట్రావెల్స్ ప్రైవేట్ బస్సులను సోమవారం రాత్రి ఆదోని పీసీఆర్ సర్కిల్ దగ్గర ఆదోని రెండో పట్టణ సీఐ రాజశేఖర్ రెడ్డి, పోలీసు సిబ్బందితో కలిసి డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ఇద్దరు బస్సు డ్రైవర్లు , ఒక ద్విచక్ర వాహనదారుడు డ్రంక్ అండ్ డ్రైవ్ లో పట్టుబడ్డారు. ట్రావెల్స్ బస్ డ్రైవర్లకు ఆదోని జె ఎఫ్ సి ఎం కోర్టు 15 రోజుల పాటు జైలు శిక్ష విధించారు. ఒక ద్విచక్ర వాహనదారుడు కి ఆదోని జె ఎఫ్ సి ఎం కోర్టు 3 రోజుల పాటు జైలు శిక్ష విధించారు.

## బుద్ధుని బోధనలు ప్రపంచానికి ఆదర్శం

మనగళం, బనగానపల్లె : బనగానపల్లె మండలం పలుకూరు గ్రామంలో స్థానిక రామాలయం ఆవరణలో జేకేఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జేఎస్ బ్రహ్మానంద చారి గౌతమ్ బుద్ధుని బోధనలు విశిష్టతపై సదస్సు నిర్వహించారు. ముందుగా గౌతమ్ బుద్ధుని చిత్రపటానికి పూలమాల వేసిన బ్రహ్మానంద చారి అనంతరం సదస్సును ఉద్దేశించి మాట్లాడారు. గౌతమ్ బుద్ధుని బోధనలు ప్రపంచానికి ఆదర్శమని, అన్నిటిని త్యజించి సమాజానికి మంచి బోధనలు అందించిన గొప్ప వ్యక్తి గౌతమ్ బుద్ధుడని చెప్పారు. శాంతి, అహింస, సత్యం మార్గంలో ప్రతి ఒక్కరు నడవాలని గౌతమ్ బుద్ధుడు బోధించాడని బ్రహ్మానందచారి గుర్తు చేశారు. కార్యక్రమంలో ఆంజనేయస్వామి భక్త మండల అధ్యక్షుడు కేఏ వెంకటసుబ్బయ్య గౌడ్, శివ, గణేశు, వేణు, ఆంజనేయ స్వామి తదితరులు పాల్గొన్నారు.

# 10న కర్నూలు బాలోత్సవం



మనగళం, కర్నూలు సిటీ : కర్నూలు నగర శివార్లలోని మాంటిస్సోరి ఇండస్ పాఠశాలలో ఈ నెల 9, 10న నిర్వహించే కర్నూలు బాలోత్సవాన్ని విజయవంతం చేయాలని బాలోత్సవం గౌరవాధ్యక్షులు జి పుల్లయ్య, అధ్యక్షులు జంధ్యాల రఘుబాబు, ప్రధాన కార్యదర్శి డి ధనుంజయ కోరారు. కర్నూలు ఎ క్యాంప్ మాంటిస్సోరి పాఠశాలలో మంగళవారం బాలోత్సవం లోగో ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కర్నూలు బాలోత్సవం గౌరవాధ్యక్షులు జి పుల్లయ్య మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లలతో గడిపే సమయం లేకపోవడం వల్ల పిల్లలు ఫోన్లు, ట్యాబ్లకు బానిసలవుతున్నారన్నారు. మార్కులు, ర్యాంకులు, సీట్లు అనే పద్ధతిలో విద్యా సంస్థలు ఉంటున్నాయన్నారు. పిల్లలను కంట్రోల్ చేసుకోవడం టీచర్లకు పెద్ద సమస్య అయిపోయిందని, పిల్లలపై జాగ్రత్త వహించకపోతే వారి మానసిక ఆరోగ్య పరిస్థితి ఆందోళనకంగా మారుతుందని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో బాలోత్సవం లాంటి కార్యక్రమాల్లో పిల్లలు పాల్గొనేలా చేయడం మంచి పరిణామమన్నారు. బాలోత్సవం ద్వారా కొంత మందైనా సెల్ఫోన్ నుంచి దూరంగా ఉండటానికి అవకాశం ఏర్పడుతుందన్నారు. 5వ బాలోత్సవం మంచి వాతావరణంలో దిగ్విజయం కావాలని ఆకాంక్షించారు. బాలోత్సవం అధ్యక్షులు జంధ్యాల రఘుబాబు, ప్రధాన కార్యదర్శి డి ధనుంజయ మాట్లాడుతూ మానసిక ఒత్తిడి నుంచి విద్యార్థులు బయట పడేందుకు బాలోత్సవం దోహదం చేస్తుందన్నారు. అకడమిక్, కల్చరల్ కార్యక్రమాలతో పండుగ వాతావరణంలో బాలోత్సవం నిర్వహించనున్నామని, 2వేల మందికి పైగా పిల్లలతో ఈ సంబరం జరపనున్నామని తెలిపారు. కంటి వైద్య నిపుణులు డాక్టర్ కె స్వాతి మాట్లాడుతూ గత బాలోత్సవం స్ఫూర్తితో పిల్లలందరూ ఈ బాలోత్సవంలో పాల్గొనాలని కోరారు. ప్రతి ఏడాది పండుగలా బాలోత్సవాన్ని నిర్వహిస్తున్నందుకు కమిటీ సభ్యులకు అభినందనలు తెలిపారు. ప్రైవేట్ల విద్యా సంస్థల జిల్లా గౌరవాధ్యక్షులు పిబివి సుబ్బయ్య మాట్లాడుతూ పిల్లలందరూ పాల్గొనేలా చేసి సృజనాత్మకతను వెలికి తీసేలా ఈ బాలోత్సవం నిర్వహిస్తున్నారని, పిల్లలను కేవలం చదువుకే పరిమితం చేయకుండా ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొనేలా చేయాలని కోరారు. క్లస్టర్ యూనివర్సిటీ డీన్ డాక్టర్ అక్తర్ భాను మాట్లాడుతూ పిల్లల్లోని నైపుణ్యాలను వెలికి తీసేందుకు మానసిక ఉల్లాసం కోసం ఈ కార్యక్రమాలు తోడ్పడతాయన్నారు. ముందుగా కర్నూలు బాలోత్సవం పూర్వ ప్రధాన కార్యదర్శి జెఎన్ శేషయ్యకు నివాళిగా మౌనం పాటించారు. కార్యక్రమంలో ప్రయివేటు విద్యా సంస్థల జిల్లా అధ్యక్షులు వాసుదేవయ్య, మాంటిస్సోరి విద్యా సంస్థల సిఈఓ విల్సన్, ఇండస్ పాఠశాల ప్రిన్సిపల్ మీనాక్షి విల్సన్, బాలోత్సవం ఉపాధ్యక్షులు సుధీర్ రాజు, రమాదేవి, కోశాధికారి జె రంగస్వామి, ప్రచార కార్యదర్శులు ఈ ఎల్లాగౌడ్, డి చంద్రమోహన్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## శ్రీ సుబ్రహ్మణ్యస్వామివారికి విశేష అభిషేకం



మనగళం శ్రీశైలం : లోకకల్యాణం కోసం దేవస్థానం ఈ రోజు (02.12.2025) ఉదయం ఆలయప్రాంగణంలోని శ్రీసుబ్రహ్మణ్యస్వామి (కుమారస్వామి) వారికి విశేష పూజలను నిర్వహించడం జరిగింది. ప్రతి మంగళవారం మరియు కృత్తికానక్షత్రం, షష్ఠి తిథి రోజులలో శ్రీ సుబ్రహ్మణ్యస్వామి వారికి ఈ విశేషఅభిషేకం మరియు పూజాదికాలు దేవస్థానంసేవగా (సర్కారిసేవగా) నిర్వహించబడుతున్నాయి. కుమారస్వామివారికి పూజలు జరపడం వలన లోకకల్యాణమే కాకుండా ప్రతి ఒక్కరికి ఉద్యోగ, వ్యాపార, వ్యవహారాలలో ఆటుపోట్లు తొలగి ఆయా పనులు సక్రమంగా జరుగుతాయి. సుబ్రహ్మణ్యస్వామి అనుగ్రహంతో శత్రుబాధలు, గ్రహపీడలు, దృష్టి దోషాలు మొదలైనవి తొలగిపోతాయి. అలాగే సంతానం కోసం పూజించేవారికి తప్పక సంతానభాగ్యం లభిస్తుందని చెప్పబడుతోంది. ఈ అభిషేకానికి ముందుగా దేశం శాంతిసౌభాగ్యాలతో విలసిల్లాలని, ప్రకృతివైపరీత్యాలు సంభవించకుండా సకాలంలో తగినంత వర్షాలు కురిసి, పంటలు బాగా పండాలని, పాడి సమృద్ధిగా ఉండాలని, జనులకు ఆయురారోగ్యాలు కలిగి వారికి అకాలమరణాలు రాకుండా ఉండాలని, దేశంలో అగ్నిప్రమాదాలు, వాహన ప్రమాదాలు మొదలైనవి జరగకుండా ఉండాలని, జనులందరూ సుఖశాంతులతో ఉండాలంటూ అర్చకస్వాములు సంకల్పాన్ని పఠించారు. తరువాత కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు మహాగణపతిపూజ జరిపించబడింది. అనంతరం శ్రీసుబ్రహ్మణ్యస్వామివారికి అభిషేకము, అర్చన తరువాత సుబ్రహ్మణ్యస్తోత్ర పారాయణలు చేయబడ్డాయి. సుబ్రహ్మణ్యస్వామి అభిషేకంలో స్వామివారికి పంచామృతాలైన పాలు, పెరుగు, తేనె, నెయ్యి, కొబ్బరి నీళ్ళు మరియు వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ముఖ్యంగా వివిధ పండ్ల రసాలతో చేసే అభిషేకంతో ఎంతో ఫలితం ఉంటుందని ఆగమాలు చెబుతున్నాయి.

# ఓటర్ల మ్యాపింగ్ పూర్తి చేయాలి

**– కర్నూలు నియోజకవర్గ ఆర్వో, కమిషనర్ పి.విశ్వనాథ్**



మనగళం, కర్నూలు కార్పొరేషన్ : కర్నూలు నియోజకవర్గంలో ఎస్ఐఆర్‌ను బూత్ స్థాయిలో ఖచ్చితంగా, ఎలాంటి తప్పుల్లేకుండా పూర్తి చేయాలని రిటర్నింగ్ అధికారి, నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్ సూచించారు. ఎస్బిఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో అసిస్టెంట్ ఆర్వోలతో కలిసి బూత్ స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆర్వో మాట్లాడుతూ.. ఎస్ఐఆర్ మ్యాపింగ్‌ను బూత్ స్థాయిలో అత్యంత జాగ్రత్తగా పూర్తి చేయాలని బీఎల్వోలకు సూచించారు. ప్రతి ఓటర్ వివరాలు, చిరునామా ధృవీకరణ, కుటుంబ సభ్యుల సమాచారం అన్నీ బూత్ యాప్‌లో తప్పనిసరిగా, ఖచ్చితంగా నమోదు కావాలని పేర్కొన్నారు. ఎస్ఐఆర్ మ్యాపింగ్‌లో నిర్లక్ష్యం జరిగితే ఎన్నికల నియమావళి ప్రకారం చర్యలు తప్పవని స్పష్టం చేశారు. కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గంలో మొత్తం 2,74,743 మంది ఓటర్లలో 29,946 మంది మాత్రమే బిఎల్‌వోలు మ్యాపింగ్ చేశారని, 7,716 మంది ప్రోజనీ నమోదు చేసినట్లు ఆర్వో వివరించారు. మొత్తం మ్యాపింగ్ శాతం 13.76 శాతం మాత్రమే ఉండటంతో దీన్ని అత్యవసరంగా పెంచి ప్రతీ బూత్‌లో 100శాతం మ్యాపింగ్ సాధించాలని సూచించారు. ఎస్ఐఆర్ ఖచ్చితత్వం ఎన్నికల పారదర్శకతకు పునాదిగా పనిచేస్తుందని ఆర్వో పేర్కొన్నారు.

కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గంకు అదనంగా ముగ్గురు అదనపు ఏఈఆర్వోలను జిల్లా కలెక్టర్ నియమించారని, ఆర్.జి.వి.కృష్ణ (అదనపు కమిషనర్), కె.వి.సతీష్ కుమార్ రెడ్డి (డిప్యూటీ కమిషనర్), పి.వి.శేష సాయి (ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్) ముగ్గురు అదనపు ఏఈఆర్వోలు బీఎల్వో సూపర్వైజర్లు, బీఎల్‌వోలు నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ పనితీరును రోజువారీగా టీసీ లేదా ప్రత్యేక సమావేశాల ద్వారా సమీక్షించాలని సూచించారు. ప్రతి అదనపు ఏఈఆర్వోకి కేటాయించిన బీఎల్‌వోలపై రోజువారీ పర్యవేక్షణ చేయాలని, ప్రతి బీఎల్వో సూపర్వైజర్ తన పరిధిలోని బీఎల్‌వోలు ఇంటింటికీ వెళ్లి నిజంగా ఎస్ఐఆర్ మ్యాపింగ్ చేస్తున్నారు కాదా అన్నది నేరుగా పరిశీలించాలని ఆర్వో ఆదేశించారు. ప్రతి బీఎల్వో రోజుకు సందర్శించే ఇళ్ల సంఖ్య, మ్యాపింగ్ పురోగతి, కుటుంబ వివరాలు పూర్తి చేశారా అన్న సమాచారం రోజూ గూగుల్ స్ప్రెడ్‌షీట్‌లో నమోదు చేయాలని సూచించారు. కొత్తగా నియమితులైన బీఎల్‌వోలు తక్షణమే ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియ ప్రారంభించాలని ఆదేశించారు. ఓటర్ల మార్పులు, చేర్పులు, వయస్సు ధృవీకరణ, చిరునామా నిర్ధారణ వంటి అంశాలను ప్రతీ బూత్ స్థాయిలో పూర్తిస్థాయిలో అమలు చేసి కర్నూలును రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా నిలపాలని ఆర్వో సూచించారు. సమావేశంలో తహసీల్దార్ రవికుమార్, అదనపు ఏఈఆర్వోలు ఆర్.జి.వి.కృష్ణ, కె.వి.సతీష్ కుమార్ రెడ్డి, పి.వి.శేష సాయి, ఉప తహసిల్దార్ ధనుంజయ, సూపరింటెండెంట్ సుబ్బన్న, బీఎల్‌వో సూపర్వైజర్లు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

## అనుగొండ గ్రామంలో హరిజన ఏరియాలో కరెంటు స్తంభాలు కోసం జిల్లా అధికారి ఎస్ ఇ కి వినతి

మన గళం కోడుమూరు: కర్నూలు జిల్లా కోడుమూరు అనుగొండ గ్రామంలో హరిజన ఏరియాలో కరెంటు స్తంభాలు లేక కొన్ని సంవత్సరాలు నుండి ఎంతో ఇబ్బంది పడుతున్న సమస్యను దృష్టిలో పెట్టుకొని కోడుమూరు మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి ఈ సమస్యను గౌరవ విష్ణువర్ధన్ కి మరియు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి కి తెలుపగా తక్షణమే ఏపీ ఎస్పీడీసీఎల్ జిల్లా అధికారి ఎస్ ఇ చెప్పగా వెంటనే రామకృష్ణారెడ్డి జిల్లా అధికారైనటువంటి ఎస్ ఇ కలువగా జిల్లా అధికారి తక్షణమే ఈ సమస్య పరిష్కరించాలని ఆదేశించడం జరిగింది.



# సెల్‌ఫోన్ డ్రైవింగ్ ప్రమాదకరం



మనగళం, కర్నూలు క్రైం : సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం ప్రమాదకరమని, జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ మంగళవారం తెలిపారు. ద్విచక్రవాహనదారులు తప్పకుండా హెల్మెట్లు ధరించాలని సూచించారు. సెల్‌ఫోన్లు మాట్లాడుతూ వాహనాలు నడపరాదని, వాహనాలు వేగంగా నడిపి ప్రమాదాలకు గురికావద్దని కోరారు. ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలు పాటించాలని, లేని పక్షంలో అమాయక ప్రజలు రోడ్డు ప్రమాదాలకు బలికావాల్సి వస్తుందన్నారు. రహదారి నిబంధనలు ఉల్లఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు లైసెన్సు రద్దు చేస్తామని హెచ్చరించారు. ప్రతి రైడర్ బాధ్యతగా ఉండాలన్నారు. ఫోన్ మాట్లాడే ముందు ఆలోచించాలన్నారు. అత్యవసరమైతే వాహనం ప్రక్కకు ఆపి మాట్లాడం చేయాలన్నారు. డ్రైవింగ్ చేస్తూ ఫోన్ మాట్లాడవద్దని గమ్యానికి సురక్షితంగా చేరాలని జిల్లా ఎస్పీ గారు తెలిపారు. ఈ సంవత్సరం 2025 జనవరి నుండి నవంబర్ 30 వరకు సెల్ ఫోన్ డ్రైవింగ్ కేసులు 925 నమోదు చేశామని జిల్లా ఎస్పీ శ్రీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ గారు తెలిపారు.

# నందీశ్వరస్వామివారికి విశేషపూజలు





మనగళం శ్రీశైలం : ఈ రోజు (02.12.2025) మధ్యాహ్నానికి త్రయోదశి ఘడియలు రావడంతో నందీశ్వరస్వామి వారికి పరోక్షసేవగా విశేషార్చన జరిపించబడుతోంది. ప్రతీ మంగళవారం రోజున మరియు త్రయోదశిరోజులలో దేవస్థానసేవగా (సర్కారీసేవగా) ఈ కైంకర్యం జరిపించబడుతోంది. అయితే ప్రతి నెలలో కూడా త్రయోదశి రోజులలో అనగా శుద్ధ త్రయోదశి మరియు బహుళ త్రయోదశి రోజులలో భక్తులు నందీశ్వరస్వామివారి పూజను పరోక్షసేవగా జరిపించుకునే అవకాశం కూడా కల్పించబడింది. ఈ విశేషార్చనలో ముందుగా లోకక్షేమాన్ని కాంక్షిస్తూ దేశం శాంతిసౌభాగ్యాలతో విలసిల్లాలని, ప్రకృతి వైపరిత్యాలు సంభవించకుండా సకాలంలో తగినంత వర్షాలు కురిసి, పంటలు బాగా పండాలని, పాడి సమృద్ధిగా ఉండాలని, జనులకు ఆయురారోగ్యాలు కలిగి వారికి అకాలమరణాలు రాకుండా ఉండాలని, దేశంలో అగ్నిప్రమాదాలు, వాహన ప్రమాదాలు మొదలైనవి జరగకుండా ఉండాలని, జనులందరూ సుఖశాంతులతో ఉండాలంటూ అర్చకస్వాములు, వేదపండితులు సంకల్పాన్ని చెప్పడం జరుగుతోంది. అనంతరం కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకుమహాగణపతిపూజను జరిపించబడుతోంది. ఆ తరువాత నందీశ్వరస్వామికి శాస్త్రోక్తంగా పంచామృతాలతోనూ, ఫలోదకాలతో హరిద్రోదకం, కుంకుమోదకం, గంధోదకం, భస్మోదకం, రుద్రాక్షోదకం, బిల్వోదకం, పుష్పోదకం, సువర్ణోదకం మరియు మల్లికాగుండంలోని శుద్ధజలంతో అభిషేకం నిర్వహిస్తారు. తరువాత నందీశ్వరస్వామికి అన్నాభిషేకం నిర్వహించబడుతుంది. వృషభసూక్తం మొదలైన వేదమంత్రాలతో శాస్త్రోక్తంగా ఈ విశేషాభిషేకాన్ని చేయడం జరుగుతుంది. తరువాత నందీశ్వరస్వామివారికి నూతనవస్త్ర సమర్పణ, విశేషపుష్పార్చనలను చేస్తారు. అనంతరం నానబెట్టిన శనగలను నందీశ్వరస్వామికి సమర్పించడం జరుగుతుంది. కాగా త్రయోదశి రోజున జరిపించబడే నందీశ్వరస్వామివారి పరోక్షసేవకు భక్తులు ఆన్‌లైన్ ద్వారా రూ.1,116/-లను సేవారుసుముగా చెల్లించాల్సి ఉంటుంది. భక్తులు సేవారుసుము లేదా %ఖుజ్ఞ్వఎజూశ్రీవం.ఖజూ.స్త్రశీజ.ఱఅ% ద్వారా చెల్లింపు చేయవచ్చు. నందీశ్వరస్వామివారి ఆరాధన వలన సంతానంలేనివారికి సంతానం కలుగుతుందని, సమస్యలు తొలగి సుఖసంతోషాలు కలుగుతాయని, ఋణబాధలు తీరుతాయని, అనారోగ్యం తొలగి ఆరోగ్యం చేకూరుతుందని, కష్టాలు నివారించబడతాయని, మానసిక ప్రశాంతత చేకూరుతుందని పండితులు పేర్కొంటున్నారు. అదేవిధంగా ఈ స్వామికి నానబెట్టినశనగలను సమర్పించడం వలన కోరిన కోరికలు నెరవేరుతాయని చెప్పబడుతోంది. అందుకే ఈ స్వామివారికి శనగలబసవన్న అనే పేరు కూడా ప్రసిద్ధంగా ఉంది. ఈ పరోక్షసేవ ప్రత్యక్ష ప్రసారాలను వీక్షించేందుకు వీలుగా ప్రసార వివరాలు, ప్రసారాల సమయం మొదలైనవాటిని ఎప్పటికప్పుడు సేవాకర్తలకు తెలియజేయడం జరుగుతున్నది. సేవాకర్తలేకాకుండా భక్తులందరు కూడా వీటిని శ్రీశైలటి.వి / యూ ట్యూబ్ ద్వారా వీక్షించవచ్చును. కావున భక్తులందరు కూడా ఈ పరోక్షసేవను సద్వినియోగం చేసుకోవాలని కోరుకుంటున్నాము. ఇతర వివరములకు దేవస్థానం సమాచార కేంద్ర ఫోన్ నంబర్లు 83339 01351 / 52 / 53 లను సంప్రదించవచ్చును.

## గిరిజనులకు గొడుగుల పంపిణీ



మన గళం : ప్రకాశం జిల్లా పెద్దదోర్నాల మండలం చెంచు కుంట గిరిజన గ్రామంలో శాడీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చెంచు గిరిజనులకు గొడుగులను పంపిణీ చేశారు. ట్రస్ట్ ఫౌండర్ కవలకుంట నాగరాజు నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో, ఇటీవల తుఫాన్ కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న గిరిజనులకు వర్షాలు%-%ఎండల నుండి రక్షణ కల్పించేందుకు గొడుగులు ఉపయోగపడుతాయని ఆయన తెలిపారు. గిరిజనుల అభివృద్ధి కోసం త్వరలో మరోకొన్ని సేవా కార్యక్రమాలు, ప్రత్యేక ప్రాజెక్టులు చేపట్టనున్నట్లు నాగరాజు వెల్లడించారు. కార్యక్రమంలో గిరిజనులకు పండ్లు, బిస్కెట్లు కూడా పంపిణీ చేశారు. ఈ సందర్భంలో ట్రస్ట్ సభ్యులు జడ లక్ష్మయ్య, జెడ్డా డానియల్, తంగిరాల ఆనంద్ బాబు, జెడ్డా యాకోబు, దర్శనం తిరుపాలు మద్దూరి దానియేలు తదితరులు పాల్గొన్నారు.

## ఉక్రెయిన్ యుద్ధ చర్చల్లో కీలక మలుపు



న్యూ ఢిల్లీ, డిసెంబర్ 2 , మనగళం, ఉక్రెయిన్%-%రష్యా యుద్ధం ప్రపంచాన్ని కలవరపరుస్తున్న వేళ.. ఈ వివాదానికి ముగింపు పలికే దిశగా కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. అమెరికా ప్రత్యేక ప్రతినిధి స్టీవ్ విట్‌కాఫ్‌తో రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ భేటీ కానున్నట్లు సమాచారం వెలువడింది. ఈ భేటీతో యుద్ధ చర్చల్లో కొత్త దశ ఆరంభం కానున్నదన్న అంచనాలు వ్యాపిస్తున్నాయి. అమెరికా మాజీ అధ్యక్షుడు ట్రంప్‌కు అత్యంత సన్నిహితుడైన జెర్డ్ కుష్నర్ కూడా ఈ చర్చల్లో పాల్గొనవచ్చని వర్గాలు వెల్లడించాయి. ఫ్లోరిడాలో ఇటీవల ఉక్రెయిన్ ప్రతినిధులు%-%అమెరికా అధికారులు రెండు రోజులపాటు చర్చలు జరిపారు. ఈ సమావేశాల్లో విట్‌కాఫ్, కుష్నర్ పాల్గొనడం అంతర్జాతీయ అంచనాలకు కొత్త ఊపిరి పోసింది. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఈ చర్చలను నిర్మాణాత్మకంగా జరిగాయని పేర్కొనడంతో శాంతి ఒప్పంద అవకాశాలు మరింతగా చర్చనీయాంశమవుతున్నాయి. రష్యాకు అనుకూలంగా ఉండే కొన్ని ప్రతిపాదనలపై అమెరికా పనిచేస్తోందని అంతర్జాతీయ దౌత్య వర్గాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో పుతిన్%-%అమెరికా ప్రతినిధి సమావేశం అత్యంత ప్రాధాన్యంగా మారింది. నెలల తరబడి సాగుతున్న యుద్ధాన్ని ముగించేందుకు ఈ చర్చలు కీలక మలుపు కావన్న భావన పెరుగుతోంది.

ఉక్రెయిన్%-%రష్యా ఘర్షణతో తీవ్రంగా దెబ్బతిన్న ప్రాంతాలకు శాంతి, సాధారణ జీవన విధానాన్ని తీసుకురావడంపై రెండు దేశాల ప్రజల్లోనూ భారీగా ఆశలు నెలకొన్నాయి. పుతిన్%-%విట్‌కాఫ్ సమావేశం తేదీ, ప్రదేశం వివరాలు ఇంకా వెల్లడికాలేకపోయినా.. అగ్రరాజ్యం%-%రష్యా దౌత్యచర్యలు కొత్త దశలోకి అడుగుపెట్టనుందన్న సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

## బీజేపీ అభ్యర్థిగా సోనియా గాంధీ..




తిరువనంతపురం : డిసెంబర్ 2 , మన గళం : కేరళ స్థానిక ఎన్నికల్లో ఓ ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. మున్నార్ పంచాయతీ ఎన్నికలో కమలం పార్టీ వ్యూహాత్మకంగా అడుగు వేసింది. కాంగ్రెస్‌కు గట్టి ఎదురు దెబ్బ ఇవ్వాలనే ప్రయత్నంలో, సోనియా గాంధీ పేరున్న మహిళను బరిలోకి దింపింది. పేరుతోనే దేశ రాజకీయాల్లో ప్రభావం చూపిన వ్యక్తిని గుర్తు చేసే ఈ నిర్ణయం, స్థానికంగా హస్తం పార్టీకి భారీ చిక్కులు సృష్టించింది.

మరో వారం రోజుల్లో జరగనున్న కేరళ స్థానిక ఎన్నికలు రెండు దశల్లో జరుగనున్నాయి. డిసెంబరు 9, 11 తేదీల్లో పోలింగ్ నిర్వహించి, 13న ఫలితాలు ప్రకటించనున్నారు. ఈ ఎన్నికల్లో మూడు ప్రధాన పార్టీలూ అభ్యర్థులతో బరిలోకి దిగి హోరాహోరీగా ప్రచారం సాగిస్తున్నాయి.

అలాంటి పరిస్థితుల్లో మున్నార్ పంచాయతీ స్థానానికి కాంగ్రెస్ అభ్యర్థిగా మంజుల రమేశ్‌ను నిలబెట్టింది. అదే స్థానానికి బీజేపీ, 'సోనియా గాంధీ' అనే స్థానిక మహిళను నిలబెట్టడం పెద్ద చర్చకు దారితీసింది. ఈ పేరు చూసిన ఓటర్లు గందరగోళానికి గురయ్యే అవకాశముందని కాంగ్రెస్ నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల ప్రచారంలో కూడా ఈ అంశమే ప్రధానంగా మారింది.

సోనియా గాంధీ పేరున్న ఈ మహిళపై ఇప్పుడు స్థానిక ప్రజల దృష్టంతా కేంద్రీకరించబడింది. కమలం పార్టీ అనుసరిస్తున్న వ్యూహాత్మక ప్రచారం కారణంగా ఈ పేరు ఇప్పుడు పంచాయతీ పరిధిలో ఒక్కసారిగా మార్మోగిపోతోంది. ఈ అనూహ్య పరిణామం కేరళ రాజకీయ వాతావరణాన్ని వేడెక్కించింది

# పది పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలి





**- డ్రాప్ అవుట్ శాతం జీరో ఉండాలి - జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి**

మనగళం, చిప్పగిరి : జిల్లాలో 10 వ తరగతి విద్యార్థుల డ్రాప్ అవుట్ శాతం జీరో ఉండాలని, అదే విధంగా వంద శాతం ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ డా.ఏ. సిరి ఉపాధ్యాయులను సూచించారు. మండల కేంద్రం చిప్పగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను పరిశీలిస్తూ 10 వ తరగతి లో డ్రాప్ ఔట్ అయిన విద్యార్థులు ఎంత మంది ఉన్నారనే విషయాన్ని హెడ్ మాస్టర్ ను ఆరా తీశారు. 10 వ తరగతి లో డ్రాప్ ఔట్ అయిన విద్యార్థుల తల్లితండ్రులతో మాట్లాడి వారిని ఒప్పించి తిరిగి పాఠశాలకు పిలిపించి 10 వ తరగతి పబ్లిక్ పరీక్షలకు దరఖాస్తు చేయించే విధంగా చర్యలు తీసుకోవాలని హెడ్ మాస్టర్ ను ఆదేశించారు. ఒకవేళ వారి తల్లితండ్రులు ఏమైనా పనుల మీద ఇతర ఊర్లకు వెళ్తే వారి పిల్లలను సీజనల్ వసతి గృహాల్లో చేర్పించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ 10 వ తరగతి విద్యార్థుల డ్రాప్ అవుట్ శాతం జీరో ఉండాలన్నారు. 10 వ తరగతి విద్యార్థులతో కలెక్టర్ నేరుగా మాట్లాడుతూ జీవితంలో ఒక లక్ష్యం పెట్టుకోవాలని, టీవీ లు చూడటానికి, ఫోన్ లు వాడటానికి ఎక్కువ సమయం కేటాయించకుండా, శ్రద్ధగా కష్టపడి చదువుకొని జీవితంలో స్థిరపడాలన్నారు. అమ్మ, నాన్న లను బాగా చూసుకోవాలని తెలిపారు. ఉపాధ్యాయులు చెప్పే పాఠాలు బాగానే అర్థం అవుతున్నాయా? సబ్జెక్ట్ పరంగా ఏమైనా సందేహాలు ఉంటే ఓపికతో వివరిస్తున్నారా ? ఏమైనా సమస్యలు ఉన్నాయా అని కలెక్టర్ విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. బాల్య వివాహాలు చేసుకోవడం వల్ల ఎలాంటి సమస్యలు వస్తాయనే దానిమీద ఉపాధ్యాయులు అవగాహన కల్పిస్తున్నారా అని కలెక్టర్ విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. బాల్య వివాహాలు చేసుకోవడం వల్ల వచ్చే సమస్యల గురించి కలెక్టర్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. 10 వ తరగతిలో 100 శాతం ఉత్తీర్ణత సాధించేందుకు జిల్లాలో డిసెంబర్ 6 నుంచి 100 రోజుల యాక్షన్ ప్లాన్ ప్రారంభమవుతుందన్నారు. ప్రతి సబ్జెక్ట్ టీచర్ ఉదయం సమయంలో వారు సాయంత్రం నిర్వహించే పరీక్షకి సంబంధించిన ప్రశ్నల గురించి విద్యార్థులతో రివిజన్ చేయించి సాయంత్రం పరీక్ష నిర్వహించాలన్నారు. సంబంధిత వివరాలు జిల్లా కేంద్రం పోర్టల్‌లో తప్పనిసరిగా అప్లోడ్ చేయాలన్నారు. ప్రాథమిక స్థాయి నుంచే ఎఫ్.ఎల్.ఎన్ పై పాఠశాలలు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. మధ్యాహ్న భోజన వంట నాణ్యతను కలెక్టర్ పరిశీలిస్తూ వంటగదిని పరిశుభ్రంగా ఉంచాలని, భోజన రుచిని మరింత మెరుగుపరచాలని కలెక్టర్ వంట సిబ్బందిని ఆదేశించారు. చిప్పగిరి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువును మానేసిన తేజకుమార్, రోహిణి విద్యార్థులతో కలెక్టర్ ఫోన్ కాల్ ద్వారా నేరుగా మాట్లాడారు. పాఠశాలకు రావడానికి ఏమి సమస్య ఉంది, చదువుకుంటూనే జీవితం మారుతుందని, భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకునే అవకాశాలు ఉంటాయని తిరిగి పాఠశాలకు రావాలని కోరారు. కాంపౌండ్ వాల్, తాగు నీరు, టాయిలెట్ సమస్యలు ఉన్నాయని కలెక్టర్ దృష్టికి తీసుకొని రాగా పరిష్కార చర్యలు తీసుకుంటామన్నారు. పాఠశాలకు నీటి సమస్య లేకుండా వారం రోజుల్లో అదనంగా ట్యాప్ కనెక్షన్ ఏర్పాటు చేయించాలని ఎంపీడీఓ ను ఆదేశించారు. కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్, మత్స్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ రంగనాథ్ బాబు, జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ పాల్, ఎంఈఓ సావిత్రి, చిప్పగిరి ఇంచార్జి తహసీల్దార్ ఎజాజ్ అహ్మద్, ఎంపీడీఓ అల్లబకాష్, హెడ్ మాస్టర్ లతీఫ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందాలి.. ఎమ్మెల్యే కోట్ల






మన గళం ప్యాపిలి పట్టణంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఈ రోజు ప్యాపిలి గ్రామ మరియు వార్డ్ సచివాలయ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించిన డోన్ శాసనసభ్యులు కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి ప్రజా సేవల పంపిణీపై విస్తృతంగా సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సచివాలయాలు ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రధాన ద్వారం అని, ప్రతి సిబ్బంది తమ బాధ్యతను నిబద్ధతతో నిర్వర్తించాలని సూచించారు. ప్రజలు ఏవైనా ఫిర్యాదులు లేదా సమస్యలు తీసుకువస్తే వాటిని తక్షణమే పరిష్కరించాలి, నిర్లక్ష్యం లేదా ఆలస్యం అసహ్యకరమని స్పష్టం చేశారు.అలాగే ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, ప్రభుత్వ పథకాల అమలు పట్ల ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలని సూచించారు. ప్రజల సమస్యలపై సత్వర చర్య తీసుకుంటేనే ప్రభుత్వం పట్ల నమ్మకం పెరుగుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ సమావేశంలో సచివాలయ సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## శ్రీ చైతన్య ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఆధ్వర్యంలో నాడు ఫిట్ ఇండియా ర్యాలీ




మన గళం బనగానపల్లె: బనగానపల్లి పట్టణం పెండేగంటి నగర్ లోని శ్రీ చైతన్య మేనేజ్మెంట్ వారి ఆధ్వర్యంలో నడపబడుతున్న శ్రీ ధాత్రి ఇంగ్లీష్ మీడియం స్కూల్ నందు మంగళవారం నాడు ఫిట్ ఇండియా ర్యాలీని పాఠశాల నుండి పట్టణ పోలీస్ స్టేషన్ వరకు నిర్వహించారు ఈ కార్యక్రమంలో ఎస్సై దుగ్గి రెడ్డి పాల్గొని విద్యార్థులకు శారీరక ఆరోగ్యం బాగుంటే విద్యార్థులు చురుగ్గా చదువులో మంచి ఉన్నతిని సాధిస్తారని ఫిట్నెస్ గురించి వ్యాయామం గురించి అవగాహన కలిగించారు ఈ సందర్భంగా ఆర్ ఐ చౌదరి కోఆర్డినేటర్ గోవింద్ మాట్లాడుతూ శ్రీ చైతన్య స్కూల్ ఏజీఎం సురేష్ ఆదేశం మేరకు ఫిట్ ఇండియా ర్యాలీని నిర్వహించామని ఈ కార్యక్రమాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గారు ప్రవేశపెట్టినారు అని విద్యార్థులు తమ రోజువారి కార్యక్రమాలలో వ్యాయామాన్ని ఒక భాగంగా చేర్చుకోవాలని శారీరక ఆరోగ్యం గురించి వివరించడం జరిగింది ఈ కార్యక్రమంలో ఆర్ ఐ చౌదరి కోఆర్డినేటర్ గోవిందు ప్రిన్సిపాల్ తస్లీం డీన్ హరీష్ ప్రైమరీ ఇంచార్జ్ హైమావతి ప్రీ ప్రైమరీ ఇంచార్జ్ స్వర్ణలత ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొనడం జరిగింది.

# కేజీబీవీ పాఠశాల అభివృద్ధే లక్ష్యం

**- విద్యాకమిటీ చైర్మన్ భీమన్న - దాతల సహకారంతో వాలీబాల్ గ్రౌండ్ ఏర్పాటు.**





నందవరం డిసెంబర్ 2 మనగళం న్యూస్ : కేజీబీవీ పాఠశాల అభివృద్దే లక్ష్యమని విద్యాకమిటీ చైర్మన్ భీమన్న తెలిపారు.పాఠశాలలో నూతన వాలీబాల్ గ్రౌండ్ ప్రారంభోత్సవం మంగళవారం పిఈటి శిరోమణి ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. ముఖ్య అతిథులుగా మండల వైద్యాధికారిని శ్రీలేఖ,వ్యవసాయ అధికారిని సరిత,జనసేన మండల అధ్యక్షులు పెద్ద ఎల్లప్ప,తుగ్గలి ఈరన్న గౌడ్,హెడ్ కానిస్టేబుల్ రవి,వైస్ చైర్మన్ సునీత పాల్గొన్నరు.వారిని పిఈటి,చైర్మన్ ఘనంగా సన్మానించి ఆహ్వానం పలికారు.ముఖ్య అతిధులు రిబ్బన్ కట్ చేసి గ్రౌండ్ ప్రారంభించారు.ఈ సందర్భంగా వైద్యాధికారిణి శ్రీలేఖ,సరిత మాట్లాడారు.విద్యతోపాటు ఆటలు కూడా ముఖ్యమని విద్యార్థులకు సూచించారు.మానసిక సమస్యలు తలెత్తకుండా ఉండాలంటే ప్రశాంతమైన వాతావరణంలో క్రీడలు ఆడాలని తెలిపారు. జనసేన మండల అధ్యక్షుడు ఎల్లప్ప,రవి మాట్లాడారు.విద్యార్థులు క్రీడారంగంలో అభివృద్ధి చెందాలని కోరారు.క్రీడల ద్వారా మానసిక ఉల్లాసము,ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని తెలిపారు.ఎల్లప్పను విద్యార్థులు,ఉపాధ్యాయులు కబడ్డీ గ్రౌండ్ కు సహకరించాలని కోరగా ఆయన స్పందించి కబడ్డీ గ్రౌండ్ నిర్మాణానికి ఆర్థిక సహాయాన్ని అందిస్తానన్నారు.ఈరన్న గౌడ్ మాట్లాడారు.స్కూల్ అభివృద్ధికి మరింత సహాయాన్ని అందిస్తామని తెలిపారు.రాబోయే పదవ తరగతిలో స్కూల్లో ప్రథమ స్థానాన్ని సాధించిన విద్యార్థినికి బహుమతినందిస్తానన్నారు. పీఈటి శిరోమణి మాట్లాడారు.పాఠశాలలో విధులు నిర్వహించినప్పటినుండి గ్రౌండ్ సదుపాయం లేక ఇబ్బందులు ఎదుర్కొన్నాము.చైర్మన్ స్పందించి వాలీబాల్ కోటు నిర్మించడం ఆనందదాయకమని తెలిపారు.ఈ సందర్భంగా భీమన్న మాట్లాడారు. చైర్మన్ గా ఎన్నికైనప్పుడు నుండి స్కూల్ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు.చైర్మన్ గా ఎన్నిక కావడం అదృష్టంగా భావించాను,పేద విద్యార్థులకు సహాయం చేయడానికి దేవుడు ఇచ్చిన గొప్ప అవకాశంగా భావించానన్నారు.మౌలిక సదుపాయాలను కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నారు.మా పాఠశాలలో విద్యార్థులు రాష్ట్రీయ స్థాయికి ఎన్నికైన వాళ్ళు ఉన్నారు.క్రీడా స్ఫూర్తి ఉన్న మైదానం అనుకూలంగా లేకపోవడం వలన వారి క్రీడాభివృద్ధికి సహాయం చేయాలన్న సంకల్పంతో దాతలను సహకారం అడగడం జరిగింది.అడిగిన వెంటనే చాలామంది వ్యక్తులు ఆర్థిక సహాయాన్ని అందించి మానవత్వాన్ని చాటుకున్నారు.జనసేన మండల అధ్యక్షులు 18 వేలు,సాఫ్టవర్ ఇంజనీర్ నల్లంగి నాగరాజ్ 10 వేలు, టిడిపి నాయకులు బోయ వీరేష్ 4వేలు,ఎల్ఐసి తుగ్గలి ఈరన్న గౌడ్ 3వేలు,కోట వీధికి చెందిన కానిస్టేబుల్ లక్ష్మణ 2 వేలు, కానిస్టేబుల్ బి.రవి వెయ్యి రూపాయలు,విద్యా కమిటీ వైస్ చైర్మన్ సునీత 2వేలు,విజయ్ 500 ఇచ్చారన్నారు. తన వంతు సహాయంగా 8 వేలు ఇచ్చినట్లు భీమన్న తెలిపారు.విద్యార్థుల క్రీడాభివృద్ధికి సహాయాన్ని అందించిన దాతలకు,గ్రౌండ్ అభివృద్ధికి తనతో పాటుగా కృషిచేసిన విశాలాంధ్ర విలేకర్ గోవింద్ కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, చంద్ర. అంజి, ఇర్ఫాన్, ఆదిల్, పవన్, పూలచింత శంకర్, రామలింగడు, బంగారి, నరసింహులు పాల్గొన్నారు.

# డొక్కా సీతమ్మ మధ్యాహ్నం భోజన తనిఖీ చేసిన ఎంపీడీవో పుల్లయ్య...





నందవరం డిసెంబర్ 2 మనగళం న్యూస్ : నందవరం మండల పరిధిలోని పొనకలదీన్నే గ్రామమును మండల పరిషత్ అభివృద్ధి అధికారి నందవరం వారు అక్కడ ఉన్న వివిధ ప్రభుత్వ సంస్థలను సందర్శించారు వాటి పనితీరును పరిశీలించి, ప్రజలకు నాణ్యమైన సర్వీస్ అందించుటకు తగు సూచనలు జారీ చేయడమైనది.

గ్రామ సచివాలయం సందర్శించి అటెండెన్స్, మూమెంట్ రిజిస్టర్స్ మరియు ప్రజలకు అందిస్తున్న సేవలను పరిశీలించడం జరిగింది. సచివాల ఉద్యోగులు అందరూ సమయపాలన తప్పక పాటించాలని, పెండింగ్లో ఉన్న పనులు, సర్వేలను త్వరగా పూర్తి చేయవలసినదిగా కోరడమైనది. గ్రామంలో ఉన్న అంగన్వాడీ సెంటర్స్ 1,2 సందర్శించి పిల్లలకు, గర్భిణులకు మరియు బాలింతలకు ఇస్తున్న సేవలు గురించి అడిగి టైం లోపల వారికి అందించాలని, ఏవైనా సమస్యలు ఉంటే తెలపాలని తెలియజేశాము.అటెండెన్స్ రిజిస్టర్ వెరిఫై చేసి ప్రతిరోజు 100% పిల్లలు సెంటర్ కు వచ్చేలా చూడాలని టీచర్స్ మరియు సెంటర్ సహాయకులను ఆదేశించడమైనది. గ్రామంలో ఉన్న ఎంపీపీ స్కూల్ ను సందర్శించి పిల్లలకు తరగతుల వారీగా ఉన్న పాఠ్యాంశాలు అర్థమయ్యే విధంగా బోధిస్తు వారి నైపుణ్యాలు పెంచే విధంగా చూడాలని ఉపాధ్యాయులతో చర్చించడమైనది. మరియు డొక్కా సీతమ్మ మధ్యాహ్నం భోజన పథకం నాణ్యతను పరిశీలించి, ఇటీవల ప్రభుత్వం ప్రతి విద్యార్థికి అగు సగటు ఖర్చు వ్యయం ను పెంచినందున ఇంకా క్వాలిటీ పెంచుటకు చర్యలు తీసుకోవాల్సిందిగా వంట తయారీ నిర్వాహకులకు ఆదేశాలు ఇవ్వడం జరిగింది. పోనకలదిన్నె గ్రామంలో ఉపాధి హామీ పథకం కింద 100 కాంపోస్ట్ పిట్స్ మంజూరయ్యాయి. వాటిని త్వరగా పూర్తి చేయాలని ఫీల్డ్ అసిస్టెంట్ ను, ఉపాధి హామీ సిబ్బందినీ ఆదేశించడమైనది. గ్రామంలోని రైతులు ప్రజలు కూడా విరి విరిగా కాంపోస్టు %జూఌం% త్రవ్వుకోవాలని దానిద్వారా గ్రామంలోని రహదారులు పరిశుభ్రంగా మారుతాయని తెలపడం అయినది. ఈ కార్యక్రమంలో పొనకలదీన్నే పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, సచివాలయ సిబ్బంది ఫీల్డ్ అసిస్టెంట్ లక్ష్మీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# నాగలూటిలో ప్రారంభమైన తితిదే ధార్మిక కార్యక్రమాలు



మనగళం, మిడుతూరు : శ్రీమద్రామాయణం భారతీయుల నందరినీ ఏదో ఒకవిధంగా ప్రభావితం చేస్తుందని, రామాయణం లేని భారతీయ సమాజాన్ని ఊహించుకోలేమని తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచారపరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకట రెడ్డి అన్నారు. మిడుతూరు మండలం, నాగలూటి గ్రామంలోని ఆంజనేయస్వామి దేవస్థానం నందు తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచారపరిషత్ ఆధ్వర్యంలో ధార్మిక కార్యక్రమాలను ఆయన ప్రారంభించారు. స్థానిక భజన మండలిచే భజనలు, తదనంతరం గరుడాద్రి వనజ కుమారి శ్రీమద్రామాయణంలో ప్రభావిత స్త్రీ పాత్రల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఆలయకమిటీ చైర్మన్ సర్వేశ్వర రెడ్డి, గ్రామ సర్పంచ్ ఉషారాణి, చిన్న పుల్లారెడ్డి, మాజీ సింగిల్ విండో చైర్మన్ తులసిరెడ్డి, నాగిరెడ్డి, బి. ఎల్లారెడ్డి, టి. వెంకట రమణారెడ్డి, టి. వెంకటరెడ్డి, బి. రమణారెడ్డి, నీలకంఠేశ్వరప్ప, రాంభూపాల్ రెడ్డి, చిన్న ఎల్లారెడ్డి, కట్ట నాగిరెడ్డి, ఎ.శివశంకర్ రెడ్డితోపాటు భజనమండలి సభ్యులు పాల్గొన్నారు.

# మహా పాదయాత్ర మరియు హిందువుల ఆత్మీయ సమ్మేళన సభ జయప్రదం చేయండి




మన గళం కోడుమూరు: కర్నూలు జిల్లా కోడుమూరు పట్టణం నందు జరగబోవు మహా పాదయాత్ర మరియు హిందువుల ఆత్మీయ సమ్మేళన సభ ను విజయవంతం చేయుట కొరకు ఈరోజు అనగా 02/12/2025 న కోడుమూరు పట్టణం నందుగల బీ.సీ కాలనీలోని ఆంజనేయ స్వామి దేవాలయ కమిటీ మరియు కుల సంఘ పెద్దలందరిని ఆహ్వానిస్తున్న సందర్భంలో భారీ ఎత్తున పాల్గొన్న హిందూ బంధువులు ఈ కార్యక్రమంలో హిందూ సమ్మేళన నిర్వహణ సమితిసభ్యులు స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదకర ఇనుపరాడ్లను తొలగించాలి



మనగళం, ఎమ్మిగనూరు : ఎమ్మిగనూరు తహసీల్దార్ కార్యాలయం ముఖద్వారం దగ్గర ఉన్న కాలువ పై ప్రమాదకరంగా ఉన్న ఇనుపరాడ్లను తొలగించాలని సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు ఎం.సత్యన్న కోరారు. ఈ మేరకు మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో అధికారులకు నాయకులు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపిడిఓ కార్యాలయం,సబ్ - ట్రెజరీ, వ్యవసాయ, అంగన్వాడీ, పోలీసు స్టేషన్ మరికొన్ని ప్రభుత్వ కార్యాలయాలు ఉండడంతో నిరంతరం రద్దీగా ఉండే ప్రాంతంలో ఇలా ప్రమాదకరంగా మారినా ఇనుపరాడ్ల వలన పాదచారులు, వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఎక్కువగా ఉందని అన్నారు. అధికారులు స్పందించి ప్రమాదకర ఇనుపరాడ్ల తొలగింపునకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బాలరాజు, బాబు, రాజు, ఈరన్న,వి. బాబు తదితరులు పాల్గొన్నారు.

# పార్వతమ్మకు అభినందనల వెల్లువ



మనగళం, ఆత్మకూరు : ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రాహ్మణ సంక్షేమం, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ బ్రహ్మశ్రీ కమ్మరి పార్వతమ్మకు అభినందనలు వెల్లువెత్తాయి. ఆత్మకూరు పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో మంగళవారం ఆమెకు పట్టణ విశ్వబ్రాహ్మణ సంఘీయులు అభినందనలు తెలిపారు. కొందరు బొకేలు అందజేసి అభినందించగా మరికొందరు పూలమాలలు వేసి శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా విశ్వకర్మ యువజన పథకం గురించి చర్చించారు. కుల వృత్తి ఆదరణ కరువుతున్నందువలన కొత్త పథకాలను మహిళలు ఎంచుకోవాలని ఈ సందర్భంగా పార్వతమ్మ సూచించారు. మహిళలు స్వయం ఉపాధి కల్పించుకోవాలన్నారు. మహిళలు ఆర్థికంగా స్థిరపడాలని, అప్పుడే సమాజంలో గౌరవం దక్కుతుందని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు విశ్వరూప చారి, సహదేవా చారి, మల్లికార్జున ఆచారి, రాఘవాచారి, రాజగోపాల్ ఆచారి, మల్లయ్య చారి, సత్యనారాయణ చారి, శివయాచారి, శంకరా చారి, సురేష్ ఆచారి, టైలర్ కుమార్ ఆచారి, ఓంకారమాచారి, పోతులూరి అయ్యా చారి తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో పారిశుధ్యం లోపించకూడదు

**- కర్నూలు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి.**



మనగళం, మద్దికెర: గ్రామాల్లో పారిశుధ్యం లోపించకూడదని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి పేర్కొన్నారు. మంగళవారం మద్దికెర తహసీల్దార్ కార్యాలయంలో ఆర్డీవో, రెవెన్యూ, మండల పరిషత్, వ్యవసాయ శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, విద్య శాఖ, ఇరిగేషన్, గ్రామీణ నీటి సరఫరా శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యం లోపించకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామాల్లో అభివృద్ధి పనులు నాణ్యతతో చేయాలని సూచించారు. ఇంటింటి చెత్త సేకరణ, తాగునీరు, వీధి దీపాలు, స్వర్ణ పంచాయతీ పోర్టల్ అప్డేషన్, అలాగే గ్రామ సచివాలయం సిబ్బంది విధుల నిర్వహణ, హాజరు, సంబంధిత అంశాల పై ఆరా తీశారు. పంచాయతీ ఐవిఆర్ఎస్ కాల్స్ కు సంబంధించి ప్రజల నుండి సానుకూలత వ్యక్తం అయ్యేలా పనులు చేయాలని అధికారులను ఆదేశించారు. మండలంలో ఇప్పటివరకు ఎన్ని డెలివరీలు చేశారని వైద్య అధికారులను ఆరా తీశారు. గత మాసంలో 9 ప్రసవాలు అయ్యాయని చెప్పారు.. అలాగే హైరిస్క్ గర్భిణీల గుర్తింపు, లెప్రసీ, టీబీ కేసుల గురించి ఆరా తీశారు.. రోజుకు ఎన్ని ఓపీ లు వస్తాయి అని ఆరా తీశారు.. హైరిస్క్ గర్భిణీల ను గుర్తించి, వారికి సకాలంలో మెరుగైన వైద్య సేవలు అందించేలా వైద్యులను ఆదేశించారు. వ్యవసాయానికి సంబంధించి రెండు, మూడు రకాల పంటలు సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. వేసవిలో తాగునీటికి సమస్యలు లేకుండా ముందస్తు ప్రణాళిక తో తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఆర్డీవో భరత్ నాయక్, తహసీల్దార్, ఎంపిడిఓ ,ఇతర మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక


## శ్రీశైల దేవస్థానంలో చెంచు గిరిజనులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్న ట్రస్ట్ బోర్డు చైర్మన్ రమేష్ నాయుడు

మనగళం శ్రీశైలం : చెంచు గిరిజనులకు ఉద్యోగ ఉపాధి. అవకాశాలు కల్పిస్తామని కొమరం భీమ్ గిరిజన సంఘానికి చైర్మన్ తెలిపారు . చెంచు గిరిజనులకు. ఉపాధి కల్పిస్తాం టెస్ట్ బుక్ చైర్మన్ రమేష్ నాయుడు పెంచులకు హామీ శ్రీశైల దేవస్థానంలో పాలకమండలి ఆఫీస్ నందు టెస్ట్ బోర్డ్ చైర్మన్ రమేష్ నాయుడు. కొమరం భీం గౌరవ అధ్యక్షులు వై ఆశీర్వాదం . చెంచు గిరిజన మహిళ టెస్ట్ బోర్డునెంబ. గుండ్ల గంగమ్మ ఆయన కలిసి వినతి పత్రం ఇచ్చి ఆయనతో మాట్లాడుతూ శ్రీశైల దేవస్థానంలో. స్వామివారి పల్లకి సేవలో ఎప్పటినుంచో మా చెంచు గిరిజనులు పల్లకి సేవలో పాల్గొంటున్నారని కొంతమంది చనిపోయారని వారి పిల్లలకు పల్లకి సేవలలో ప్రాధాన్యత కల్పించాలని. వారికి ఉద్యోగ అవకాశం ఉపాధి కల్పించాలనివారిని కోరగాస్పందించిన ఆయన చెంచు గిరిజన యువతకు పుణ్యక్షేత్రంలో ప్రాధాన్యత కల్పించేలా.పాలకమండలితీసుకుంటుందని. చెంచు గిరిజనులకు దేవస్థానంలో ప్రాధాన్యత కల్పిస్తుందని మంచి గిరిజన్లో అభివృద్ధి కోసం పాలకమండలి కృషి చేస్తుందని వారు తెలిపారు వారిని కలిసిన వారిలో శివపార్వతుల




సంచి గిరిజన సంక్షేమ సంఘం ఉపాధ్యక్షురాలు కామేశ్వరి పార్వతి భ్రమరాంబ. సాయి కార్యదర్శి పిట్ట మల్లికార్జున బాబు చెంచు గిరిజన యువతి యువకులు పాల్గొన్నారు.

## శ్రీశైలం టోల్గేట్ వద్ద భారీ బందోబస్తుతో చెకింగ్ చేస్తున్న సిఐ ప్రసాద్ రావు





మనగళం శ్రీశైలం : శ్రీశైలంలో తుపాకీతో పట్టుబడ్డ వ్యక్తి శ్రీశైలం టోల్గేట్ దగ్గర వాహనాల తనిఖీలు చేస్తుండగా దొరికిన తుపాకి దొరికిన తుపాకీని శ్రీశైలం సిఐ ప్రసాదరావుకు అందజేసిన పోలీసులు,టెంపుల్ సెక్యూరిటీ శ్రీశైలంలో కలకలం రేపుతున్న తుపాకీ వ్యవహారం విచారిస్తున్న పోలీసులు..పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

## కోడుమూరు మండల అభివృద్ధి కొరకై నిధులు కేటాయించాలి. సిపిఎం







మన గళం కోడుమూరు: సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో మండల అభివృద్ధి కొరకు నిధులు కేటాయించాలని మండల కార్యదర్శి కే రాజు అధ్యక్షతన తహసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించడం జరిగింది ఈ ధర్నా కార్యక్రమాన్ని ఉద్దేశించి సిపిఎం పార్టీ మండల నాయకులు గఫూర్మియా. రాజు మాట్లాడుతూ నవంబర్ నెలలో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో రైతులు కార్మికులు పేదలు బడుగు బలహీన వర్గాలు గ్రామాల అభివృద్ధి పరిశీలన కొరకు జీపు జాత నిర్వహించడం జరిగింది మండలంలోని 16 గ్రామాలు తిరిగి అక్కడ ఉన్నటువంటి సమస్యలను పరిశీలించడం జరిగింది . అందులో ప్రధానమైనటువంటి సమస్యలు విలయతాండవం ఆడుతున్నాయి రైతులు పండించిన పంటలు గిట్టుబాటు ధర లేక ఎంతో మంది రైతులు అప్పుల పాలై ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు అందులో చాలామంది ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు ఈ మధ్యలో ఉల్లి పంట రైతాంగాన్ని పెద్ద ఎత్తున నష్టపరిచింది అధిక వర్షాలు ఒకపక్క గిట్టుబాటు ధర లేక మరోపక్క రైతు కోలుకోలేని పరిస్థితిలో ఉన్నాడు అంతలోనే పత్తి వచ్చింది రైతుల పండించిన పత్తి పంటను సీసీఐ ద్వారా కొనుగోలు చేస్తామని ప్రభుత్వం చెప్పింది కొనుగోలు కేంద్రాలలో పత్తి నాణ్యత పై కొర్రీలు పెట్టి తక్కువ రేటుకి తీసుకుంటున్నారు ఈ విషయమై రైతులను సంప్రదించగా 6000 నుండి 7 వేల వరకు తీసుకుంటున్నారు అని అన్నారు సిపిఎం పార్టీగా మేము ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం కనీసం మద్దతు ధర పత్తికి 12,000 ఇస్తే రైతుకు ధర గిట్టుబాటు అవుతుంది అలాగే రైతు భరోసా కింద 20,000 ఇస్తామన్నారు అవి ఏ మాత్రం చాలదు కనీసం ఎకరాకు 50 వేల రూపాయలు ఇస్తే రైతు కోల్కుంటాడు అలాగే గోరంట్ల గ్రామంలో హంద్రీ నదిపై నిర్మాణంలో ఆగిపోయిన బ్రిడ్జిని పూర్తి చేస్తే క్రిష్ణగిరి వెల్దుర్తి మండలాల నుండి వచ్చే వారికి చాలా మంచి సదుపాయం ఉంటుంది వర్కూరు గ్రామం నుండి పులకుర్తి వరకు రోడ్డు పూర్తిగా చెడిపోయింది అలాగే గ్రామీణ ప్రాంతాల్లోని చాలా రహదారులు అధ్వాన స్థితిలో ఉన్నాయి ముఖ్యంగా కోడుమూరులో శాశ్వత తాగునీటి పరిష్కారం కొరకు గత 35 ఏళ్లుగా వామపక్ష పార్టీలు ఆందోళన చేస్తున్నాయి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు ప్రజాప్రతినిధులు అందరూ నిర్మిస్తామని హామీలు ఇస్తున్నారు గాని ఇంతవరకు సమ్మర్ స్టోరీస్ ట్యాంక్ నిర్మించలేదు కోడుమూరు మండలానికి చుట్టూ ఉన్నటువంటి మండలాలు గోనెగండ్ల దేవనకొండ క్రిష్ణగిరి గూడూరు మండలాల్లో డిగ్రీ కాలేజీలు లేవు కోడుమూరులో ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ నిర్మిస్తే చుట్టూ ఉన్న మండలాలకు ఎంతో సౌకర్యం ఉంటుంది విద్యార్థులు కూడా డిగ్రీ చదవడానికి మంచి అవకాశాలుంటాయి గ్రామీణ ప్రాంతా పేదలు డిగ్రీ చదవడానికి ప్రైవేట్ కాలేజీలలో ఫీజులు కట్టలేక వారి పిల్లల చదువులు ఇంటర్మీడియట్ వరకే ఆపేస్తున్నారు కోడుమూరులో వెంటనే ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ ఏర్పాటు చేయాలి కోడుమూరు టౌన్ లో ఉర్దూ పాఠశాల పదవ తరగతి వరకు ఉన్నది ఇందులో బాలికలు ఎక్కువ శాతం ఉన్నారు ఇంటర్ చదవాలంటే కర్నూలు వెళ్లాలి అక్కడికి పంపి చదివించాలంటే తల్లిదండ్రులు వెనకాడుతున్నారు కోడుమూరులో జూనియర్ కాలేజీ ఉర్దూ ఏర్పాటు చేస్తే చుట్టూ మండలాలకు కూడా పిల్లలకు మంచి అవకాశం ఉంటుంది నియోజకవర్గ కేంద్రమైన కోడుమూరులో ఐటిఐ ప్రభుత్వ కాలేజీ లేకపోవడం చాలా బాధాకరం అలాగే కోడుమూరులో చేనేత కార్మికులు పెద్ద ఎత్తున ఉన్నారు ప్రభుత్వం చేనేత దినోత్సవం రోజు 200 ఉచిత విద్యుత్ ఇస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు ఇంతవరకు నోచుకోలేదు 100 యూనిట్ల వరకు ఉచితంగా ఇస్తున్నారు ఆపై ఒకటి రెండు యూనిట్లు కాలిన మొత్తం 100 యూనిట్ల తో సహా కలిపి కరెంటు బిల్లు వస్తుంది ఇది చాలా దారుణం కచ్చితంగా చేనేత కార్మికులకు 200 యూనిట్స్ ఉచిత విద్యుత్తు ఇవ్వాల్సిందే పాలకుర్తి గ్రామానికి గత 35 సంవత్సరాల కిందట నుంచి పాలకుర్తి కర్నూలు ప్రత్యేక ఆర్టీసీ బస్సు ఉండేది కరోనా కారణంగా ఆ బస్సును రద్దు చేశారు గ్రామస్తులంతా ఆ బస్సును పునరుద్ధించాలని కోరుతున్నారు దానిపై కూడా అధికారులు దృష్టి సారించాలి కొత్తూరు గ్రామంలో ఆ గ్రామం పుట్టినప్పటి నుండి కుంట చెరువు నీళ్లే తాగుతున్నారు ఇప్పటివరకు ఆ చెరువులో అనేక రకాలుగా పురుగులు ఉన్నాయి పశువులు ఒకపక్క దిగుతున్నాయి ఆ నీరు చాలా కలుషితంగా ఉన్నాయి . అలాంటి నీళ్లనే ఆ గ్రామ ప్రజలు ఇప్పటికి తాగుతున్నారు సిపిఎం పార్టీగా మేము అడుగుతున్నాము హంద్రీ నది నుండి పైప్లైన్ ద్వారా త్రాగునీరు అందించాలని కోరుతున్నాము అలాగే మండల అభివృద్ధి కొరకు ప్రత్యేక నిధులు కేటాయించి మండలంలోని అన్ని గ్రామాలకు త్రాగు సాగు నీళ్లు అందించాలి సిసి రోడ్ డ్రైనేజీలు నిర్మించాలి ప్రతి గ్రామంలో గ్రామానికి దగ్గరలో ప్రజలకు అనువైన చోట ఇంటి స్థలాలు ఇచ్చి పక్క గృహాలు నిర్మించి ఇవ్వాలి అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు పెన్షన్లు మంజూరు చేయాలి కోడుమూరులో ఇంద్రజిత్తు గుప్తా నగర్లో నివాసం ఉంటున్న పేదలందరికీ ఇంటి పట్టాలు ఇచ్చి పక్క గ్రహాలు నిర్మించాలని ఆయన అన్నారు అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఆర్ఐ అశోక్ కుమార్ కి అందించడం జరిగింది . ఈ కార్యక్రమంలో లక్ష్మన్న కుమారస్వామి టీ వీరన్న బుడ్డప్ప గిడ్డయ్య మునుస్వామి శేఖర్ మల్లికార్జున శంకర్ పరమేష్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## బెట్టింగ్, మట్కాగంజాయి లపై పోలీసులు ఉక్కుపాదం మోపాలి ఏఐవైఎఫ్ డిమాండ్



మన గళం కోడుమూరు: కోడుమూరు మండలంలో అత్యంత రహస్యంగా జరుగుతున్న బెట్టింగ్, మట్కా, గంజాయి లపై పోలీసులు ఉక్కుపాదం మోపాలని ఒక ప్రైవేట్ కళాశాలలో జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు శ్రీరాములు గౌడ్ పిలుపునిచ్చారు.మండలంలో అనేకమంది యువత చెడు అలవాట్లకు బానిసలుగా తయారై జీవితాలను నాశనం చేసుకుంటున్నారని వారి పట్ల ఎప్పటికప్పుడు తల్లితండ్రులు గమనిస్తూ ఉండాలని, ఎటువంటి అనుమానం వచ్చిన వెంటనే వారికి కౌన్సిలింగ్ ఇచ్చి సరైన మార్గంలో నడిచే విధంగా చూసుకోవాలని, ఇది ఎక్కువగా ఇంజనీరింగ్,మెడికల్ కళాశాల విద్యార్థులను టార్గెట్ చేసుకొని గంజాయి ముఠాలు విస్తరిస్తున్నారని అటువంటి వారిపై పోలీసులు అవగాహన సదస్సులు నిర్వహించి, మితిమిరిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, అదేవిధంగా క్రికెట్ మ్యాచ్ లు జరుగుతున్న సందర్భంగా ఆన్లైన్ బెట్టింగ్ ఎక్కువైందని, అదేవిధంగా కోడుమూరు చివరి పరిసర ప్రాంతాలలో మట్కా జోరుగా సాగుతుందని ఈ మట్కా ఊబిలో కొంతమంది ఉద్యోగులు, వ్యాపార వేత్తలు కూడా ఉన్నారని, అ ఊబిలో చిక్కుకొని కొంతమంది బయటకు చెప్పుకోలేక, చెబితే ఎక్కడ ఆత్మహత్యలకు పాల్పడుతారోనని బయపడి లోలోపలే మదనపడుతున్నారని, ఇటువంటి వారిని ఎప్పటికప్పుడు గుర్తించి వాటిని అరికట్టే విధంగా పోలీసులు చర్యలు తీసుకోవాలని, అటువంటి వారిపై కఠినంగా వ్యవహారించాలని కోరారు.ఈ ముఖ్య నాయకుల సమావేశంలో ఏఐవైఎఫ్ నాయకులు మునిస్వామి, అఖిల్, హరి, తరుణ్, కళదర్, ఆంజనేయులు, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

## సాంస్కృతిక కార్యక్రమాలు




మనగళం శ్రీశైలం : దేవస్థానము నిర్వహిస్తున్న ధర్మపథంలో భాగంగా (నిత్యకళారాధన కార్యక్రమంలో భాగంగా) ఈ రోజు (01.12.2025) శ్రీమారుతి ఆర్ట్సు అకాడమీ, మహబూబ్‌నగర్ వారిచే సంప్రదాయ నృత్య ప్రదర్శన ఏర్పాటు చేయబడింది. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళారాధన వేదిక వద్ద ఈ రోజు సాయంకాలం నుండి ఈ సంప్రదాయ నృత్య ప్రదర్శన కార్యక్రమం ఏర్పాటు చేయబడింది. ఈ కార్యక్రమములో మహాగణపతిం, మూషికవాహన, తాండవ నృత్యం, అఖిలాండేశ్వరి, శంభో శివశంభో , తాండవనృత్యకరీ, ఓం నమశ్శివాయ తదితర గీతాలకు సహస్ర, వీణాధరి, శృతిక, దివ్య, ప్రణతి, అనురాధ, అక్షర, మధుశ్రీ, అపర్ణ తదితరులు నృత్యప్రదర్శన చేయనున్నారు. కాగా ఈ నిత్య కళారాధనలో ప్రతిరోజూ హరికథ, బుర్రకథ, సంప్రదాయ నృత్యం, వాయిద్య సంగీతం, భక్తిరంజని లాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయబడుతున్నాయి. శ్రీస్వామిఅమ్మవార్లకు ఆయా కైంకర్యాలన్నీ పరిపూర్ణంగా జరగాలని మరియు ప్రాచీన సంప్రదాయ కళల పరిరక్షణలో భాగంగా ఈ నిత్యకళారాధన కార్యక్రమాలు నిర్వహించబడుతున్నాయి.

## డిసెంబర్ 5న ఆత్మీయ సమావేశం




మనగళం, నంద్యాల : జిల్లాలో డిసెంబర్ 5వ తేదీన జరిగే మెగా తల్లిదండ్రులు%–%ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం (మెగా పిటియం)ను అధికారులందరూ సమన్వయంతో విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా కలెక్టరేట్లోని తమ ఛాంబర్ నుంచి మెగాపిటిఎంపై సంబంధిత అధికారులతో టెలికాన్ఫెరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా మాట్లాడుతూ.... డిసెంబర్ 5వ తేదీన అన్ని ప్రభుత్వ పాఠశాలు, కళాశాలలో మెగా పిటీఎం కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమం ప్రైవేట్ పాఠశాలలు, ప్రైవేట్ కళాశాలలో నిర్వహించడం లేదన్నారు. మెగా పేటీఎం కు ఎక్కువగా తల్లులు వస్తున్నారని, ఈ కార్యక్రమానికి విద్యార్థి యొక్కఇంట్లో ఉన్న వారందరినీ రమ్మని చెప్పి ఇన్విటేషన్ ఇవ్వాలన్నారు. ఎంఈఓ లు ప్రతి విద్యార్థి యొక్క తల్లిదండ్రులకు ఇన్విటేషన్ వెళ్లిందా లేదా అని చూసుకోవాలన్నారు. ప్రతి మండల ప్రత్యేక అధికారి, ఆర్డిఓ, డి ఎల్ డి వో, తప్పకుండా ఏదో ఒక పాఠశాలలో పాల్గొనాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు మరియు ప్రజా ప్రతినిధులు ఎవరు ఏ స్కూల్ కి వెళ్తున్నారు అనేది ముందుగానే గుర్తించాలన్నారు. ఒకరు వెళ్లిన స్కూలుకు ఇంకొకరు వెళ్లడానికి వీలు లేదన్నారు. కలెక్టర్ వెళ్ళిన స్కూల్ కి జాయింట్ కలెక్టర్ గాని, తాసిల్దార్ గాని తదితర అధికారులు వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. ప్రతి ఒక్క జిల్లా అధికారి కూడా ఏదో ఒక పాఠశాలలో తప్పకుండా అటెండ్ కావాల్సి ఉంటుందన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి ఎవరెవరు ఏ పాఠశాలకు, కళాశాలకు వెళుతున్నారో ముందుగానే గుర్తించి వారికి తగు సూచనలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో రాజకీయ నాయకుల ఫోటోలు ఉండకూడదన్నారు. సీఎం, డిప్యూటీ సీఎం, విద్యాశాఖ మంత్రి ఫోటో లు కూడా ఉండరాదన్నారు. ఈ కార్యక్రమం పాఠశాలలు, కళాశాలలో పార్టీలకు అతీతంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. స్వాగతం ఫొటోస్ కూడా ఉండటానికి వీలు లేదన్నారు. విద్యాశాఖ నుంచి వచ్చిన బ్యాక్ డ్రాప్ మాత్రమే ఉండాలన్నారు. ఈ కార్యక్రమం ఉదయం 9.00 గంటల నుండి మధ్యాహ్నం 12.45 గంటల వరకు షెడ్యూల్ ఉంటుందన్నారు. లాస్ట్ షెడ్యూల్లో పేరెంట్స్ కి ఆటల పోటీలు కూడా నిర్వహించడం జరుగుతుందన్నారు. మొదట క్లాస్ రూమ్ ఇంట్రడక్షన్ విద్యార్థి ఎలా చదువుతున్నాడు అన్నది ఉపాధ్యాయులు తల్లిదండ్రులకు వివరిస్తారన్నారు. తరువాత ప్రభుత్వం అందజేసిన స్పోర్ట్స్ కిడ్స్, లాజికల్ లర్నింగ్స్, ల్యాబ్ ఎక్విప్మెంట్స్, లైబ్రరీ ఎక్విప్మెంట్స్, ఇవన్నీ కూడా తల్లిదండ్రులకు వివరించడం జరుగుతుందన్నారు. ఇవి అయిపోయిన తర్వాత సమావేశం ప్రారంభించడం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులు తల్లిదండ్రులు కూడా మాట్లాడడం జరుగుతుందన్నారు. అనంతరం గతంలో చేసిన విధంగా డ్రగ్స్ కు దూరంగా ఉండటం, వంటి మంచి కార్యక్రమాలతో సభ నిర్వహించడం జరుగుతుందన్నారు. తర్వాత మధ్యాహ్న భోజన పథకం ప్రతి ఒక్కరు చేయడం జరుగుతుందన్నారు. ప్రతి పాఠశాలలో ఆరోజు మధ్యాహ్న భోజనం 50 మందికి ఎక్కువగా చేయాల్సి ఉంటుందన్నారు. మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించి ఎవరికి భోజనం సమస్య రాకుండా చూడాలన్నారు. మధ్యాహ్న భోజన పథకంలో అన్నం, ఆకుకూర పప్పు, గుడ్డు, చిక్కి ఇవి మాత్రమే ఉండాలన్నారు. ఈ నాలుగు ఐటమ్స్ రుచికరంగా చేయాలన్నారు. సమావేశం అనంతరం హెచ్‌పిసి ను విద్యార్థులకు అందజేస్తారన్నారు. ప్రతి పాఠశాలలో విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులు తల్లిదండ్రుల సమక్షంలో ఇచ్చేందుకు సిద్ధంగా ఉంచాలన్నారు. ప్రతి పాఠశాలలో తప్పకుండా పారిశుద్ధ్య కార్యక్రమాలు పకడ్బందీగా చేపట్టి కార్యక్రమం అత్యంత ఘనంగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, డిపిఓ పారిశుద్ధం పై ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమం పూర్తయిన తర్వాత పాఠశాల మొత్తం క్లీన్ చేసిన తర్వాతనే ప్రధానోపాధ్యాయులు, స్పెషల్ ఆఫీసర్, ప్రతి ఒక్కరు బయటికి రావాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎటువంటి చిన్న సమస్య కూడా తలెత్తకుండా సంబంధిత అధికారులందరూ సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలన్నారు.

## ప్రసూతి,శిశు మరణాలు తగ్గించాలి

- గర్భిణులను గుర్తించడంలో నిర్లక్ష్యం తగదు
- కర్నూలు జిల్లా కలెక్టర్ డాక్టర్ సిరి



మనగళం, చిప్పగిరి : ప్రసూతి, శిశు మరణాలు తగ్గించడానికి గర్భిణుల ముందస్తు గుర్తింపు కీలకమని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి పేర్కొన్నారు. మండల కేంద్రం చిప్పగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం కలెక్టర్ తనిఖీ చేశారు. వార్డులను పరిశీలించారు. అదేవిధంగా మందుల గడువు తేదీని పరిశీలించారు. ఓపీ రిజిస్టర్ ను పరిశీలిస్తూ ఎటువంటి కేసుల మీద ఇక్కడ ఎక్కువగా ప్రజలు వస్తుంటారనే విషయాన్ని కలెక్టర్ మెడికల్ ఆఫీసర్ ను అడిగి తెలుసుకున్నారు. రోగుల పట్ల సిబ్బంది మరింత శ్రద్ధ చూపి వైద్య సేవలు అందించాలన్నారు. వైద్య సిబ్బంది అందరూ సమయానికి విధుల్లో ఉండాలని, విధుల పట్ల నిర్లక్ష్యం ఉండకూడదన్నారు. ప్రెగ్నెంట్ రిజిస్టర్ ను పరిశీలిస్తూ ఇక్కడ ఎన్ని డెలివరీలు అయ్యాయి అని అడిగి తెలుసుకున్నారు. హై రిస్క్ ప్రెగ్నెన్సీ కేసులు ఎక్కువగా ఎలాంటి కేసులు నమోదు అవుతాయనే విషయంపై ఆరా తీశారు. ప్రతి విభాగాన్ని కలెక్టర్ సందర్శిస్తూ రోగులకు అందిస్తున్న సేవలపై సిబ్బందితో వివరాలు తెలుసుకున్నారు. ఫార్మసీ ని పరిశీలించిన కలెక్టర్ త్వరలో గడువు ముగియనున్న మందులు ఏవి ఉన్నాయని వెరిఫై చేశారు. మందుల కొరత చోటు చేసుకోకుండా ముందుగానే స్టాక్‌ను అంచనా వేసి అవసరమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ వైద్య సిబ్బందిని ఆదేశించారు. ప్రసూతి వార్డులో డెలివరీ అయిన అఖిల అనే బాలింతతో కలెక్టర్ మాట్లాడారు. డెలివరీ ఎప్పుడు అయ్యారు... వైద్యులు సర్వీస్ బాగా ఇచ్చారా... ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ ఆశా వర్కర్లతో మాట్లాడుతూ గర్భిణులను 3 నెలల తర్వాత రిజిస్టర్ లో నమోదు చేయకుండా, ముందుగానే గుర్తించి వెంటనే నమోదు చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా వారి ఆరోగ్య పరిస్థితిని క్రమం తప్పకుండా పర్యవేక్షించాలన్నారు. అధిక ప్రమాద గర్భిణులను ప్రత్యేకంగా గుర్తించి వైద్య అధికారుల పర్యవేక్షణలో ఉంచాలని కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఎం హెచ్ ఓ డా.భాస్కర్ రాజు, మెడికల్ ఆఫీసర్ అఫ్రోజ్ జహాన్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### ఆలూరు షిరిడి సాయిబాబా మందిరంలో దత్తాత్రేయ జయంతి వేడుకలు.



( ఆలూరు మనగళం ): ఆలూరు మండల కేంద్రంలో స్థానికంగా వెలిసిన శ్రీ షిరిడి సాయిబాబా మందిరంలో దత్తాత్రేయ జయంతి వేడుకలు డిసెంబర్ 1వ తేది నుండి భక్తిశ్రద్దలతో నిర్వహిస్తున్నట్లు శ్రీ సాయిబాబా ఆలయ కమిటీ సభ్యులు మరియు అర్చకులు తెలిపారు. దత్తాత్రేయ జయంతి వేడుకలలో భక్తులు పాల్గొని పూజ కార్యక్రమాలు విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు ఎర్రిస్వామి, మరియు కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీశైలం టోల్గేట్ వద్ద మద్యం పట్టువేత




మనగళం శ్రీశైలం : నంద్యాల జిల్లా సునీల్ షెరాన్ గారి ఆదేశాలు మేరకు ఆత్మకూర్ %ఋూ% సూచనలు మేరకు ఈ దినం అనగా తేది 02.12.2025 న శ్రీశైలం-విజయవాడ మెయిన్ రోడ్ లో శ్రీశైలం దేవస్థానం %శిశ్రీశ్రీస్త్రుఫ్వ% వద్ద శ్రీశైలం సిఐ జి.ప్రసాద రావు మరియు సిబ్బంది బాలకృష్ణ, రఘునాధుడు, నారాయణ, నాను నాయక్, అమరనాథ రెడ్డి, ప్రసాద్, లల్షా సహేతంగా వాహనాలు తనిఖీ చేస్తుండగా ఇద్దరు వ్యక్తులు సుండిపెంట వైన్ షాప్ నందు 24 %ఖజు=ూౣూ హీూౢజుణ ఖీ×చీజు ఔ౧×ూఖ 180 మీూ నఋతీవతీ ఎశీ-ౕశ్రీవం% ను కొనుక్కొని, వాటిని %ఎూ ఞూ% మోటార్ సైకిల్ సైడ్ బ్యాగ్ నందు పెట్టుకుని శ్రీశైలంలో ఎక్కువ రేటుకు అమ్ముకుంటే ఎక్కువ డబ్బులు వస్తాయనే ఉద్దేశ్యంతో తీసుకుని వస్తూ ఉండగా పట్టుకుని కేసు నమోదు చేయడమైనది.

## టీజీ వెంకటేష్ ను కలిసిన గుమ్మనూరు నారాయణ.





( ఆలూరు మనగళం ): ఆలూరు మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ గుమ్మనూరు నారాయణ తోపాటు సతీమణి ఆలూరు బిజెపి నాయకురాలు కమలమ్మ మంగళవారం మాజీ రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేష్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా టీజీ వెంకటేష్ స్వగృహంలో కలిసి పూలబొకే అందజేసి, శాలవాలతో సన్మానించారు. అనంతరం టీజీ వెంకటేష్ ఆశీస్సులు తీసుకొన్నారు. అలాగే సీనియర్ బిజెపి నేతలు కపిలేశ్వరయ్య, జిల్లా అధ్యక్షులు అక్కమ్మతోట రామకృష్ణను సన్మానించారు. ఈనెల 12న కర్నూలు పట్టణంలో నూతనంగా ఆవిష్కరించే మాజీ ప్రధాన మంత్రి అటల్ బిహారి వాజ్పేయి విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంపై చర్చించినట్లు గుమ్మనూరు నారాయణ తెలిపారు.

## చిప్పగిరి జడ్పీ ఉన్నత పాఠశాలపై కలెక్టర్ డా. సిరి ఆకస్మిక తనిఖీ.

- విద్యార్థుల హాజరు, ఉపాధ్యాయుల బోధన, మధ్యాహ్న భోజనంపై సమగ్ర పరిశీలన.





( ఆలూరు మనగళం ): చిప్పగిరి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ డాక్టర్ సిరి, మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యారంగంలో నాణ్యతను మెరుగుపరచడం, ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యా కార్యక్రమాలు సక్రమంగా జరుగుతున్నాయో లేదో తెలుసుకునేందుకు స్కూలులో వివిధ విభాగాలను పరిశీలించారు. తనిఖీ సందర్భంగా కలెక్టర్ విద్యార్థులతో ప్రత్యక్షంగా మాట్లాడుతూ వారి చదువు, హాజరు, పాఠశాలలో అందుతున్న సౌకర్యాలపై అభిప్రాయాలు తెలుసుకున్నారు. ముఖ్యంగా 9వ తరగతి విద్యార్థుల్లో 11 మంది నిరంతరం స్కూల్‌కి రాకపోవడంతో, వారి తల్లిదండ్రులకి స్వయంగా ఫోన్ చేసి స్కూలుకు మీ పిల్లలు రావడం లేదు అని తెలుసుకున్నారు. అలాగే మీ పిల్లలు హాజరు తక్కువగా ఉంది అని ప్రశ్నించారు. స్కూల్ రాకుండా ఇంటిలోనే ఉన్న విద్యార్థి తేజతో కలెక్టర్ ఫోన్ ద్వారా మాట్లాడి, పాఠశాలకు ఎందుకు రాకుండా ఉన్నావు.? పాఠశాలలో ఏవైనా ఇబ్బందులున్నాయా? ఉపాధ్యాయులు పాఠాలు సరిగా చెబుతున్నారా లేదా అంటూ వివరాలు తెలుసుకున్నారు. విద్య నాణ్యత విషయంలో ఎలాంటి రాజీపడబోమని స్పష్టం చేసిన కలెక్టర్, విద్యార్థుల హాజరు పెరగడానికి తల్లిదండ్రులు కూడా బాధ్యత తీసుకోవాలని సూచించారు. అనంతరం ఉపాధ్యాయులతో మాట్లాడి పాఠాలు బోధించే విధానం, తరగతి గదుల నిర్వహణ, విద్యార్థులపై వ్యక్తిగత దృష్టి వంటి అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అదే సమయంలో స్కూల్‌లో అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని కూడా కలెక్టర్ ప్రత్యక్షంగా పరిశీలించారు. వంటశాలను సందర్శించి, పదార్థాల నాణ్యత, పరిశుభ్రత, మెనూ అమలు విధానంపై అధికారులకు సూచనలు చేశారు. విద్యార్థులకు సమయానికి, శుభ్రంగా భోజనం అందించాలని ఆమె ఆదేశించారు. తనిఖీ సమయంలో మండల తాహసిల్దార్, మండల విద్యాధికారి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఇతర శాఖాధికారులు పాల్గొన్నారు.

## ఐపీఎస్ అధికారి కుమార్తె ఆత్మహత్యపై సమగ్ర విచారణ జరిపించాలి. సిపిఐ.

- మాధురి మృతి పట్ల వాస్తవాలను వెలికి తీసి అందుకు బాధ్యులైన వారిపై చట్టపరమైన చర్యలు చేపట్టాలి.



మన గళం బేతంచర్ల : మండలం లోనిబుగ్గాని పల్లి తండా కు చెందిన చిన్న రాముడు. ఐఏఎస్ కుమార్తె. మాధురి సాహితీ బాయ్ మృతిపై ఉన్నత అధికారులు సమగ్ర విచారణ జరిపించి అందుకు బాధ్యులైన వారిపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్ రంగనాయుడు డిమాండ్ చేశారు. రాష్ట్ర ఎస్సీ కమిషన్ కార్యదర్శి ఐఏఎస్ హోదాలో ఉన్న చిన్న రాముడు వారి కుమార్తె మాధురి బుగ్గానిపల్లెకు చెందిన రాజేష్ నాయుడు అనే వ్యక్తిని ప్రేమించి ఈ ఏడాది మార్చి 7 వ తేదీన మహానంది ఆలయంలో కులాంతరవాహం చేసుకోవడం జరిగిందని మాధురి తల్లిదండ్రులు అప్పటి ఎస్పీకి ఫిర్యాదు చేయగా యువతి తల్లిదండ్రుల ఆమోదంతో బేతంచెర్ల సబ్ రిజిస్టర్ కార్యాలయంలో రిజిస్టర్ కూడా చేయించడం జరిగింది అని వారిద్దరూ అన్యోన్యంగా ఉన్న సమయంలో మాధురి తన భర్తకు ఉద్యోగం లేదని ఉద్యోగం వచ్చిన తర్వాత సంసారానికి వస్తానని పోలీసుల సమక్షంలో రాతపూర్వకంగా ఇవ్వడంతో పోలీసులు మాధురిని తన పోలీసులు మాధురిని తన తల్లి తండ్రులకు అప్ప చెప్పడం జరిగిందని తాడేపల్లి లోని తన తల్లిదండ్రుల వద్ద ఉన్న మాధురి ఆత్మహత్య చేసుకొని మృతి చెందిన సంఘటన బాధాకరమని వాస్తవాలను వెలికి తీయకపోతే రెండు కులాల మధ్యన అంతరాలు పెరిగే అవకాశం ఉంటుంది కావున పోలీసు అంతరాలు పెరిగే అవకాశం ఉంటుంది కావునఉన్నతాధికార్యాలు ఈ సంఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపించి అందుకు బాధ్యులైన వారిపై చట్ట పరమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

## ఆదోని జిల్లా చేసేంతవరకు పోరాటం ఆగదు




మనగళం, ఎమ్మిగనూరు : ఆదోని జిల్లా సాధన జేఏసీ విద్యార్థి యువజన సంఘాల ఆధ్వర్యంలో ఎమ్మిగనూరు లో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సోమప్ప సర్కిల్లో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ కన్వీనర్ కమలే గణేష్ ఉదయ్, శేఖర్, ఖాజా, కృష్ణ, అఫ్రీది, రఘు, బతకన్నా మాట్లాడారు. కర్నూలు జిల్లాలో వెనుకబడినటువంటి పశ్చిమ ప్రాంతమైన ఆదోని, ఎమ్మిగనూరు, మంత్రాలయం, పత్తికొండ, ఆలూరు తో కూడినటువంటి నియోజకవర్గలను జిల్లా గా ప్రకటించేంతవరకు పెద్ద ఎత్తున ఉద్యమాలు ఉధృతం చేస్తూనే ఉంటామని హెచ్చరించారు. ముఖ్యంగా జిల్లా గా ఏర్పడితే విద్య, వైద్యం, అలాగే వ్యవసాయం ఇంకా మెరుగుపడతాయని, అలాగే మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టులకు జిల్లాలకు కేంద్రం ప్రత్యేక గ్రాంట్ విడుదల చేస్తుందని వారు తెలిపారు. ఆదోని కొత్త జిల్లాతో టెక్నికల్ కోర్స్ అయినటువంటి ఐఐటీ విద్య అందుబాటులోకి వచ్చి కొత్త యూనివర్సిటీ కూడ మంజూరు అవుతాయని వారు ఉద్ఘటించారు. రాజకీయ నాయకులు, పార్టీలు, జిల్లా ఏర్పాటుకై నడుం బిగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ విద్యార్థి యువజన ప్రజా మహిళా సంఘాల నాయకులు ఈరమ్మ, రాజు, మహేంద్ర, బలరాం, రాజీవ్, నాగరాజు, చార్లెస్, రామతీర్థం, అబ్రేష్, అనీఫ్, ఏసోబు, బాల సత్యనారాయణ రెడ్డి, పిరు బాషా తదితరులు పాల్గొన్నారు.

Printed,edited,published and owned by Nagaruru Raghavendra, Printed At : Global Printers, D.No 10 MIE Industrial Estate, Kallur, Kurnool. AP.
Published From H.NO.45/139, Narasimha Reddy Nagar, Kurnool-518004.A.P. Mobile Number : 9160686078. RNI NO. AP TEL/2007/74310.